ప్రజాశక్తి

శుక్రవారం 5 మే 2023 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

పేదల ఇళ్లు పూర్తయ్యేదెప్పుడో.?

- 68,681 ఇళ్లు మంజూరైతే వాటిలో 14,447 ఇళ్లే పూర్తి
- ఆర్థిక కష్టాలతో నత్తనడకన 35 వేలకు పైనే ఇళ్ల నిర్మాణాలు..
- నాలుగేళ్లుగా 7,200 టిడ్కో ఇళ్ల పరిస్థితి అయోమయం

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

పేదలకు మంజూరు చేసిన ఇళ్లపై ప్రభుత్వం ఆశించిన స్థాయిలో దృష్టి పెట్టలేదు. వాటిని పూర్తిచేసే దిశగా మాత్రం చర్యలు కనిపించడం లేదు. పూర్తి చేయాలని, వెంటనే గృహ ప్రవేశాలు చేయించాలంటూ ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయి గృహ నిర్మాణశాఖ సిబ్బందిపై తీవ్రమైన ఒత్తిళ్లు చేస్తున్నారు. ఆచరణలో మాత్రం ముందుకు సాగడం లేదు. అధికారులు వచ్చి లబ్ధిదారులపై ఒత్తిడి చేసినంత మాత్రాన అవి వేగంగా ముందుకు సాగుతాయనుకుంటే భ్రమే.. వాస్తవానికి ఇళ్ల నిర్మాణం అంటే అంత సులువుగా లేదు. ప్రభు త్వం ఇచ్చే రూ.1.50 లక్షలతో ఇల్లు ఎలా పూర్తవుతుందో ఆలోచించాలి. పేరుకే రూ.1.80 లక్షలు. అందులో కూలీల వాటా కింద రూ.30 వేలు కలుపుతారు. కష్టపడి కుటుంబంలోని సభ్యులు పనిచేసుకుంటే దానికి ఈ నగదు ఇస్తున్నారు. అయితే ఇపుడున్న పరిస్థితుల్లో ఇంత చిన్న మొత్తంతో ఇల్లు సాధ్యమా? అంటే ఆచరణలో కాదని తేలింది. అప్పోసప్పో తెచ్చుకోగలిగిన లబ్ధిదారులు ఎట్టకేలకు పూర్తి చేసుకోగలిగారు. ఆ అవకాశం లేనోళ్లందరూ వదిలేశారు. మధ్యలోనే నిర్మాణాలు ఉన్నాయి. ఆగుతూ సాగుతూ ఉన్నాయి. ఎప్పటికి పూర్తవుతుందో వారికే తెలియదు. ఏ కాలనీ చూసినా మొండిగోడలతోనే కనిపిస్తున్నాయి. అరకొరగానే పూర్తయ్యాయి. ఇప్పటికీ ఒక్క కాలనీ కూడా నూరు శాతం పూర్తయిన దాఖలాల్లేవు. కారణం ఆర్థిక కష్టాలే.. అన్ని రకాల నిర్మాణ ▶ 2లో



టిడ్కో ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి.. లబ్ధిదారులకు ఇవ్వాలని నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు (ఫైల్)

'వెలిగొండ'ను ముంచిన వరద నీరు

- మొదటి, రెండో టన్నెల్‌లో భారీగా నీళ్లు చేరిన వైనం
- నిలిచిన ప్రాజెక్టు పనులు
- అధికారులతో ఫోన్‌లో సమీక్షించిన మంత్రి సురేష్

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాల మండలంలోని కొత్తూరు వద్ద వెలిగొండ ప్రాజెక్టును వరదనీరు ముంచెత్తింది. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ప్రాజెక్టుకు భారీగా నీరు వచ్చి చేరడంతో మొదటి, రెండో టన్నెళ్లు నీటి మునిగాయి. మొదటి టన్నెల్‌లో ఆరు అడుగుల లోతు, రెండో టన్నెల్‌లో ఇరవై అడుగుల లోతున భారీగా నీరు వచ్చి చేరింది. యంత్ర పరికరాలన్నీ నీట మునిగాయి. దీంతో ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయి. ఈ నీరంతా బయటకు తోడి తిరిగి పనులు ప్రారంభించాలంటే మరో పది రోజులు దాకా సమయం పట్టే అవకాశం ఉంది. కొల్లంవాగు వద్ద మొదటి టన్నెల్ నుంచి నీరు వచ్చి చేరి ఉంటుందని వెలుగొండ ప్రాజెక్టు ఈఈ అబుత్ అలీమ్ చెబుతున్నారు.



వెలిగొండ టన్నెల్ వద్ద భారీగా చేరిన వరద నీరు

వెలిగొండకు వరదనీరు రావడం ఇదే మొదటిసారి కాదు. గతంలో కూడా ఇలా జరిగింది. అయినా అధికారుల్లో ఎలాంటి మార్పు రాలేదు. వాస్తవానికి అధికారుల నిర్లక్ష్యంతోనే ఇలా జరిగిందని రైతుసంఘం నాయకులు అంటున్నారు. టన్నెల్‌లో ఎక్కడో పెద్ద గండి పడి ఉంటుందని భావిస్తున్నారు. దాని ద్వారానే భారీగా నీరు చేరిందని చెబుతున్నారు. గతంలో ఇలా జరిగినప్పుడు అధికారులు శాశ్వతమైన పనులు చేపట్టకపోవడం మూలంగానే ఇలా జరిగి ఉంటుందని రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు గాలి వెంకటరామిరెడ్డి విమర్శించారు. అక్టోబర్‌లో ప్రాజెక్టును పూర్తి చేసి రైతాంగానికి నీరు అందిస్తామని చెబుతున్న ప్రభుత్వం వేసవిలో అరకొరగా కురిసిన వర్షానికే ప్రాజెక్టు నీట మునిగితే.. ఇక వర్షాకాలంలో కురిసే వర్షాలకు ప్రాజెక్టు పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు నిర్లక్ష్య ధోరణిని విడనాడి మరోసారి ఇలాంటి తప్పిదాలు జరుగకుండా జాగ్రత్తలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

అధికారులతో మంత్రి సురేష్ సమీక్ష

వర్షాల కారణంగా వెలుగొండ ప్రాజెక్టు టన్నెల్లోకి నీరు చేరిన విషయం ▶ 2లో

మొక్కజొన్న రైతు విలవిల

- రోజురోజుకూ దిగజారిపోతున్న ధరలు
- మూడు నెలల్లో రూ.2,250 నుంచి రూ.1,700కు పడిపోయిన వైనం
- రైతుకు ఎకరాకు రూ.20 వేల నష్టం
- అకాలవర్షాలతో తగ్గిన దిగుబడి



వర్షానికి తడవకుండా మొక్కజొన్నలకు పట్టను కప్పిన రైతులు

ప్రజాశక్తి-బల్లికురవ రూరల్

ఆరుగాలం కష్టపడి పండించిన మొక్కజొన్న పంట చివరికి రైతులకు నష్టాన్నే మిగుల్చుతోంది. అకాల వర్షాల కారణంగా చేతికందే సమయానికి పంట నేలకొరిగి దిగుబడులు భారీగా తగ్గిపోయాయి. గత ఏడాది మొక్కజొన్న పంట ఎకరాకు 30 క్వింటాళ్ల నుంచి 35 క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. ఈ ఏడాది 15 క్వింటాళ్ల నుంచి 25 క్వింటాళ్లకు దిగుబడి పడిపోయింది. రైతులు పండించిన పంట ఇంటికి చేరే సమయానికి వ్యాపారులు, దళారులు సిండికేట్ అయ్యి మొక్కజొన్నకు ధరలు భారీగా తగ్గించడం పరిపాటిగా మారింది. గత రెండు, మూడు నెలల నుంచి 2,250 ఉన్న క్వింటా మొక్కజొన్న ధర ఇప్పుడు రూ.1700కు పడిపోయింది. దీంతో కర్షకులు నష్టాల పాలవుతున్నారు. గత ఏడాది మొక్కజొన్న పంటకు క్వింటాకు రూ.2,500 ధర ఉంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేకపోవడం వల్ల దళారులు ధరలు తగ్గించి కొంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం అన్ని రకాల పంటలకు మద్దతు ధర ప్రకటించినా.. కొనుగోలు చేయటం లేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం మద్దతు ధర రూ.1,960 ఉండగా కొనుగోలు కేంద్రాలు లేకపోవడం వల్ల కొనుగోళ్లు ప్రారంభించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ పండించిన మొక్కజొన్న పంట ఇంటికి వచ్చిందని, పంట అమ్ముదామంటే రోజురోజుకూ ధరలు తగ్గిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. కౌలు రైతులు పండించిన పంటకు మంచి ధర లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. దీనికి తోడు అకాల వర్షాలకు పంట చేతికి అందివచ్చే సమయానికి భారీగా దిగుబడులు తగ్గిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక ఎకరా పండించిన పంటకు రైతు పెట్టుబడి రూ.35 వేల వరకు ఖర్చవుతుందని, ఇప్పుడు పంటకు సరైన ధర లేకపోవడంతో ఎకరాకు 15 వేల నుంచి 20వేల రూపాయలు నష్టం వస్తుందని తీవ్ర ఆందోళనకు గురయ్యారు. మండలంలోని గుంటుపల్లి, అంబడపూడి కొమ్మినేనివారి పాలెం, వల్లాపల్లి, బల్లికురవ, నక్కబొక్కల పాడు, కొప్పరపాలెం, కొనిదన, ఉప్పమాగులూరు, కోటవారిపాలెం, చెన్నుపల్లి, సూర్యపల్లి, వైదన, కూకట్లపల్లి, గొర్రెపాడు, వెలమవారి పాలెం, రాజుపాలెం, కొత్తూరు తదితర గ్రామాల్లో సుమారుగా 600 నుంచి 900 హెక్టార్లలో మొక్కజొన్న పంట సాగు చేశారు. రైతులకు పంట కూడా దఫాలవారీగా వస్తున్నా.. అందువల్ల మొదట దిగుబడి వచ్చిన రైతుకు క్వింటాకు రూ.2,250 ధర లభించింది. ఇప్పుడు వచ్చిన పంటకు రూ.1,700కు వ్యాపారులు అడుగుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది మొక్కజొన్న క్వింటాకు రూ.2,500 ధర పలికిందని, అదే ఆశతో ఈ సంవత్సరం రైతులందరూ ఎక్కువగా మొక్కజొన్న పంట ▶ 2లో



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి

మోడీ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువు

8లో

పేదల ఇళ్లు పూర్తయ్యేదెప్పుడో.?

(మొదటిపేజీ తరువాయి)

సామాగ్రి ధరలు పెరిగాయి. సెంటున్నర భూమి ఇచ్చారు. దానిలోనే చిన్న ఇంటి నిర్మాణం మొదలు పెట్టినా పూర్తికాలేదు. సిమెంటు బస్తా రూ.400కు పైగానే ఉంది. టన్ను ఇనుము రూ.80 వేలకు పైమాటే. ఇటుకల ధరలూ అన్నిటితో పాటే పెరిగాయి. నాలుగేళ్లలో ధరలు చూస్తే అన్నీ 40 శాతం పెరిగాయని నిర్మాణ సంస్థల సంఘాల నేతలే చెబుతున్నారు. ఇసుక పరిస్థితి చెప్పేది కాదు. ట్రక్కు ఇసుక రూ.1200 నుంచి రూ.6 వేలకు పెరిగింది. దీనికి ప్రభుత్వమే కారణం. ఇలా అన్ని రకాల ధరలు పెరగడంతోనే చిన్న ఇల్లు లక్షన్నరతో కట్టడం కూడా సాధ్యం కానిపనిగా మారింది. ప్రభుత్వం ఎన్ని గడువులు పెట్టినా ఫలితం లేదు. జిల్లాలో 68,681 ఇళ్లు మంజూరైతే ఇప్పటివరకూ 14,447 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. కోర్టు వివాదాలతో 15,954 ఇళ్లు నిలిచిపోయాయి. నిర్మాణంలోనే 35,497 ఇళ్లు ఉన్నాయి. ఇవి ఎప్పటికి పూర్తవుతాయో తెలియడం లేదు. ఇంకా 2788 ఇళ్లు మొదలే పెట్టలేదు. వీటి కోసం రూ.327.70 కోట్లు వెచ్చించారు. ఒంగోలు పట్టణంలో ఒక్క ఇల్లు కూడా కట్టలేదు. ఇళ్ల స్థలాలకు ఎంపిక చేసిన స్థలమే వివాదంలో చిక్కుకుంది. దీంతో ఇక్కడ స్థలాలు ఇవ్వడం నిలిచిపోయింది. గత ప్రభుత్వం చేపట్టిన టిడ్కో ఇళ్లు అయోమయంలోనే ఉన్నాయి. జిల్లాలో గత ప్రభుత్వం వివిధ శ్రేణుల్లో మొత్తం 7,200 ఇళ్లు మొదలుపెట్టారు. నిర్మాణాలు 55 శాతం పూర్తయ్యాయి. ప్రభుత్వం మారాక వీటిని పూర్తిచేయలేదు. అలాగే పెట్టారు. లబ్ధిదారులపై భారం లేకుండా చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. రూపాయి కడితే చాలని చెప్పారు. ఎవరు ఎంత కట్టాలనే విషయం పక్కనబెడితే ఇప్పటి వరకూ వాటి పనులు ముందుకు సాగలేదు. రూ.472 కోట్లతో వీటిని చేపట్టగా ఇప్పటికే రూ.259.31 కోట్ల విలువైన పనులు జరిగాయని గుర్తించారు. చెల్లింపులు కూడా రూ.213 కోట్లు నిర్మాణ సంస్థలకు చెల్లించారు. ఇంకా రూ.159 కోట్లు పెండింగులో ఉన్నాయి. పనులు మాత్రం ఆగిపోయాయి. లబ్ధిదారులు ఇంటి కోసం నాలుగేళ్లుగా ఎదురుచూస్తూనే ఉన్నారు. వీటిపై రాజకీయ రాద్ధాంతం సాగుతోంది. టిడ్కో ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేసి.. లబ్ధిదారులకు ఇవ్వాలని గతంలో సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేశారు. తెలుగుదేశం నేతలు కూడా ఇటీవల టిడ్కో ఇళ్ల వద్దకు వెళ్లి సెల్ఫీలు తీసుకుని వాటిపై రాజకీయ విమర్శలు చేశారు. ఏదేమైనా పేదల ఇళ్ల పథకం మాత్రం ముందుకు సాగడం లేదు. ప్రభుత్వం ఇప్పటికైనా ఇళ్ల నిర్మాణంలో ఎదురవుతున్న అంశాలపై దృష్టి సారించాలి. పూర్తి చేసే మార్గాలు చూడాలి. అప్పుడే లక్ష్యం నెరవేరుతుంది.

మొక్కజొన్న రైతు విలవిల

(మొదటిపేజీ తరువాయి)

వేశారని అన్నారు.

ఇంకా ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు

ప్రభుత్వం ఒకవైపు రైతులకు పంట మద్దతు ధరలు ప్రకటించినా క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదని రైతులంటున్నారు. ప్రభుత్వం మొక్కజొన్నకు రూ.1,960 మద్దతు ధర ప్రకటించిందని.. గ్రామాల్లో ఎక్కడా కొనుగోలు చేసిన దాఖలాలు లేవని చెబుతున్నారు. దీంతో ఇదే అదునుగా ప్రైవేటు వ్యాపారస్తులు రైతుల నుంచి పంటను తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. రెండేళ్ల క్రితం బల్లికురవ, వల్లాపల్లి, వైదన, సహాయక సహకార సొసైటీ కేంద్రాల ద్వారా పంటను కొనుగోలు చేశారు. ఈ ఏడాది కొనుగోలు ఊసే లేదని ప్రభుత్వం మొక్కజొన్న రైతులకు మద్దతు ధరలకు కొనుగోలు చేసే విధంగా కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులంటున్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

నాగులుప్పలపాడు : మండల పరిధిలోని ఉప్పుగుండూరు గ్రామంలో రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా స్వామి వారికి శ్రీరామ అలంకరణలో హనుమంతుని వాహనంపై గురువారం రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ పెంట్యాల జ్యోతి శ్రీనివాసరావు , ఇఒ మీనిశెట్టి శ్రీనివాసరావు, పూజారి శ్రీధర్ బాబుపాల్గొన్నారు

రైతుకు భూమిపై హక్కులు కల్పిస్తాం : ఆర్‌డిఒ

ప్రజాశక్తి- కురిచేడు

దళిత రైతుకు భూమిపై హక్కులు కల్పిస్తామని కనిగిరి ఆర్‌డిఇ తోట విజయ్‌కుమార్ తెలిపారు. భూమిపై హక్కులు కల్పించాలని కోరుతూ తహాశీల్దారు కార్యాలయం ఎదుట కురిచేడుకు చెందిన దళిత రైతు ఇటీవల ఆందోళన చేపట్టిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా ఆర్‌డిఒ కురిచేడు తహాశీల్దారు కార్యాలయాన్ని గురువారం సందర్శించారు. మండల సర్వేయర్ నాగేశ్వరరావు చేత సంబంధింత భూమిని సర్వే చేయించారు. కంభంపాటి దేవ సహాయం భూమి అతని ఆధీనంలో సాగులో ఉన్నట్లుగా రెవెన్యూ అధికారులు నిర్ధారణకొచ్చారు. ఆ భూమికి సంబంధించిన రికార్డులను కూలంకషంగా పరిశీలించారు. కంభంపాటి దేవసహాయానికి భూమిపై హక్కులు ఉన్నాయని, ఆ భూమికి నెల రోజుల లోపల ఈపాస్ పుస్తకం మంజూరు చేస్తామని ఆర్‌డిఒ తెలిపాడు. దేవసహాయం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈ సందర్భంగా పాత్రికేయులు కురిచేడు సర్వే నెంబర్ లోని ఎ.251.00 సెట్లు, పడమర వీరాయపాలెంలోని సర్వే నెం. 8 లోని ఎ.527-00 సెంట్లు భూమిలో దాదాపు 300 ఎకరాలకు పైగా ముగ్గురు వ్యక్తులు ఆక్రమించినట్లు ఆర్‌డిఒ దృష్టికి తీసుకెళ్లారు. మరికొంత మంది బయట జిల్లాలకు చెందిన వారు మరికొంత భూమిని ఆక్రమించి సాగు చేసుకుంటున్నట్లు తెలిపారు. దీంతో స్పందించిన ఆర్‌డిఒ ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారి గుర్తించి నోటీసులు ఇచ్చి ఖాళీ చేయించాలని తహాశీల్దారు నాగుల్ మీరాను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దారు నాగుల్ మీరా, డిప్యూటీ తహాశీల్దారు శ్రీకాంత్, ఆర్‌ఐ లక్ష్మీ నారాయణ, విఆర్‌ఒలు, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు



నివాళులర్పిస్తున్న దామచర్ల సత్య

విశ్రాంత కార్యదర్శి వలికి దామచర్ల సత్య నివాళి

శింగరాయకొండ : శింగరాయకొండకు చెందిన విశ్రాంత కార్యదర్శి షేక్ వలి ఇటీవల అనారోగ్యంతో మతి చెందాడు. అందులో భాగంగా టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి దామచర్ల సత్యనారాయణ గురువారం వలి చిత్రపటానికి పూలమాల వేసే నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చీమకుర్తి కష్ణ, కె. వెంకట సుబ్బారావు, రామారావు, అబ్దుల్ సుభాన్ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-దర్శి

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మైదానంలో బూచేపల్లి అభిమానుల ఆధ్వర్యంలో వైఎస్‌ఆర్-బిఎస్‌ఆర్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. ఈ టోర్నమెంట్‌ను దర్శి నగర పంచాయతీ కౌన్సిలర్ మోహన్‌రెడ్డి, రాష్ట్ర షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టరు ఎస్‌ఎం.బాషా గురువారం ప్రారంభించారు. ఈ పోటీల్లో మొత్తం 50 జట్లు పాల్గొననున్నట్లు నిర్వాహకులు మధు, రాజశేఖర్ తెలిపారు. ఈ పోటీలు ఈనెల 11 వరకూ నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ. 1,00,000 దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అందించనున్నట్లు తెలిపారు. ద్వితీయ బహుమతిగా రూ. 60 వేలు, తృతీయ బహుమతిగా రూ. 40 వేలు, నాల్గవ బహుమతిగా రూ. 20 వేలు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి గురవారెడ్డి, బాపిరెడ్డి, వీరారెడ్డి, శ్రీనివాసరెడ్డి, నర సింహారెడ్డి, దేవదానం, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

నాగులుప్పలపాడు : క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మూరి కనకారావు తెలిపారు. మండల పరిధిలోని ఉప్పుగుండూరు ఊర చెరువు మైదానంలో జెవైఎస్ మరియు రాజేష్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలను గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ మద్దిసాని రాజేష్, నిర్వాహకులు జి.అశోక్ , ఎ.వినోద్, జి. శ్రీకాంత్, పి.మహేష్, ఎం.శ్యాంసన్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి : ఎంఇఒ

ప్రజాశక్తి-పొదిలి



ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ విద్యా సంస్థల్లో 25 శాతం ఉచిత విద్యలో భాగంగా వచ్చే విద్యా సంవత్సరానికి 1వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంఇఒ ఎం. శ్రీనివాసులు తెలిపారు. ఎంఇఒ గురువారం విలేకర్లతో మాట్లాడారు. ఐదు సంవత్సరాలు నిండిన బాలబాలికలకు ఉచితంగా ప్రైవేట్ విద్యా సంస్థల్లో అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం దర ఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థుల తల్లిదండ్రులు దరఖాస్తులను గ్రామ సచివాలయం, ఆన్ లైన్, లేదా మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. దరఖాస్తుతో పాటు విద్యార్థుల తల్లిదండ్రుల ఆధార్ కార్డు జెరాక్సులు, కుటుంబ ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డ్, నేటివిటీ, విద్యార్థి జనన ధ్రువీకరణ పత్రం, విద్యార్థి పాస్‌ఫోర్టు సైజ్ ఫొటో అందజేయాలన్నారు.

'వెలిగొండ'ను ముంచిన వరద నీరు

(మొదటిపేజీ తరువాయి)

తెలుసుకొని రాష్ట్ర పురపాలక, పట్టణాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. హైదరాబాద్‌లో ఉన్న ఆయన ఒక ప్రకటన ద్వారా వివరాలు వెల్లడించారు. శ్రీశైలం ఎగువ భాగాన ఉన్న కొల్లం వాగు వద్ద భారీగా కురిసిన వర్షాల వల్ల వరద నీరు టన్నెల్లోకి చేరిందన్నారు. ఈ వర్షపు నీరు చేరికతో ప్రస్తుతం పనులు నిలిపివేయాల్సి వచ్చిందని తెలిపారు. తక్షణమే మోటార్లతో నీటిని బయటకు పంపేందుకు చర్యలు చేపట్టి మూడు, నాలుగు రోజుల్లో తిరిగి పనులు ప్రారంభించాలని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లో పనుల్లో జాప్యం జరగకూడదని అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. ప్రాజెక్ట్ వద్ద పరిస్థితిని స్వయంగా తెలుసుకునేందుకు రెండు రోజుల్లో రానున్నానని, అధికారులతో సమీక్షించి పనులు ఆగకుండా చర్యలు తీసుకునేలా చేస్తానని చెప్పారు.

హాకీ మహిళా జట్టు మేనేజర్‌గా రవికుమార్

ప్రజాశక్తి - సంతనూతలపాడు రూరల్

ఎపి మహిళా జట్టు హాకీ మేనేజరుగా మండల పరిధిలోని మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పిఇటిగా విధులు నిర్వహిస్తున్న టి. రవికుమార్ నియమితులయ్యాడు. ఈనెల 4 నుంచి 14 వరకూ ఒడిస్సా రాష్ట్రం, రూర్కెలాలోని బిర్సా ముండా ఇంటర్నేషనల్ హాకీ స్టేడియంలో 13వ హాకీ ఇండియా సబ్ జూనియర్ మహిళల టోర్నమెంట్‌లో పాల్గొనే హాకి జట్టుకు రవికుమార్‌ను మేనేజర్ గా నియమిస్తూ హాకీ ఆంధ్రప్రదేశ్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా రవికుమార్‌ను పలువురు అభినందించారు.

మంత్రి అంబటిని కలిసిన వలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వైసిపి మైనార్టీ మండల అధ్యక్షుడు షేక్ వలి రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబును విజయవాడలోని ఆయన క్యాంపు కార్యాలయంలో గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువలు, పూలమాలలు, బుకేలతో రాంబాబును సన్మానించారు. ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం మండల ఉపాధ్యక్షుడు మేకల వెంకటేశ్వర్లు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తడిసిన పసుపు, మొక్కజొన్న పంటలను

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి : గొట్టిపాటి

ప్రజాశక్తి-అద్దంకి

అకాల వర్షాలకు తడిసిన పసుపు, మొక్కజొన్న కల్లాలను అద్దంకి మండలంలోని కొత్తరెడ్డిపాలెం గ్రామంలో గురువారం స్థానిక రైతులతో కలిసి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పరిశీలించారు. ఆరుగాలం కష్టపడి పండించి చేతికొచ్చిన పంట అమ్ముకునే లోపు తడిసి ముద్దవగా తమ కష్టం నీళ్లపాలైందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పంటలు కొనుగోలు బాధ్యత ప్రభుత్వానిదే అని ప్రకటించిన జగన్‌రెడ్డి నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం సరికాదని అన్నారు. తక్షణమే మద్దతు ధరతో రైతుల వద్ద నుంచి పసుపు, మొక్కజొన్న మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అద్దంకి నియోజకవర్గంలో దాదాపు 200 ఎకరాల్లో పసుపు, 1,500 వందల ఎకరాల్లో మొక్కజొన్న మిగులు పంటఉందని, పంటచేతికొచ్చే సమయానికి అకాల వర్షం కారణంగా పంట పూర్తిగా తడిసిపోయేసరికి కొనేనాథుడు కరువయ్యాడని అన్నారు. ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి తడిసిన పసుపు, మొక్కజొన్న పంటలను కొనుగోలు చేయాలని ఆయన అన్నారు. టిడిపి ప్రభుత్వం 2017లో క్వింటా రూ.6,800 మద్దతు ధర కల్పించి మొత్తం పసుపు కొనుగోలు


తడిసిన మొక్కజొన్నను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి

చేశామని తెలిపారు. ప్రస్తుత జగన్‌రెడ్డి ప్రభుత్వం మరీ దారుణంగా క్వింటా రూ.3500-4500 రేటు అంటూ రైతుల్ని నిలువునా దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎకరాకి రూ.75 వేలు పెట్టుబడి అయినప్పుడు మద్దతు ధర రూ.6,850 ఉంటే, అన్ని రెట్లూ పెరిగి ఎకరాకు లక్షా 50 వేలు పెట్టుబడి పెట్టిన ప్రస్తుత పరిస్థితుల్లో గిట్టుబాటు ధర గరిష్ఠంగా రూ.4,500 దాటడంలేదు. గరిష్ఠంగా పసుపు క్వింటాకి రూ.10 వేలు మద్దతు ధరకు పార్టీలు చూడకుండా రైతులందరి వద్ద నుంచి కొనుగోలు చేయాలి. ఏప్రిల్ మొదటివారం నుంచి పసుపు కొనుగోలు చేస్తామని, ఆర్బీకేలో నమోదు చేసుకోవాలని పసుపు రైతులని కోరుతూ అధికారులు ప్రకటన పత్రికా ప్రకటనకే పరిమితమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో దాదాపు 1,500 ఎకరాలలో మిగులు మొక్కజొన్న పంట ఉందని, ఎకరాకు పెట్టుబడి రూ.30 వేలు దాటిపోయి పంట దిగుబడి తగ్గిపోయిందని, వర్షాలకు మొక్కజొన్న నాణ్యత తగ్గిందని, ధర తగ్గించి రూ.1,500 నుంచి రూ.1,600కు దళారులు దండుకుంటున్నారని అన్నారు. గతంలో మొక్కజొన్న పంటకు రూ.2,300 మద్దతు ఇచ్చి దన్నుగా నిలిచారన్నారు. ఈ సంక్షోభ సమయంలో మొక్కజొన్నకు ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర రూ.1,962 ఇచ్చి కొనుగోలు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. వైసీపీ సర్కారు ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన రైతు భరోసా కేంద్రాల వైఫల్యం రైతుల పాలిట శాపంగా మారిందని ఎమ్మెల్యే దుయ్యబట్టారు. పలు రైతు భరోసా శనగల కొనుగోలు కేంద్రాలలో రైతుల పండించిన శనగపంటను పార్టీలు చూసి కొనడం లేదని పలువురు రైతులు తన దృష్టికి తీసుకు వచ్చారన్నారు. రైతులకు పార్టీలు అంటగట్టి జగన్‌రెడ్డి చరిత్ర హీనుడిగా నిలిచారన్నారు. పార్టీలు చూడకుండా రైతులందరి నుంచి పసుపు, మొక్కజొన్న, శనగ పంటలని మద్దతు ధరతో కొనుగోలు చేసి వెంటనే చెల్లింపులు చేయాలని ఎమ్మెల్యే ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

అంగన్‌వాడీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి-పంగులూరు

పంగులూరు మండలంలోని రెండు అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు, 11 ఆయా పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఐసిడిఎస్ కొరిశపాడు ప్రాజెక్టు సిడిపిఒ కృష్ణకుమారి గురువారం తెలిపారు. అంగన్‌వాడీ టీచర్ పోస్టులు జాగర్లమూడి వారిపాలెం (జనరల్), రామకూరు-2(జనరల్) కేంద్రాలలో ఖాళీగా ఉన్నాయని ఆమె తెలిపారు. ఆయా పోస్టులకు సంబంధించి జనకవరం (జనరల్), అలవలపాడు-3 (బీసీ ఈ), అలవలపాడు-4(జనరల్), బోదవాడ-4(జనరల్), తూర్పు తక్కెళ్లపాడు -1(జనరల్), భగవాన్ రాజుపాలెం-2 (జనరల్), జాగర్లమూడి-వారిపాలెం (జనరల్), కస్వాపురం (జనరల్), కొండమూరు-1(జనరల్), కొండమూరు-3(జనరల్), ఆరికట్లవారిపాలెం (ఎస్‌సి) ఖాళీగా ఉన్నాయని తెలిపారు. పై పోస్టులకు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అభ్యర్థులకు 2023వ సంవత్సరం జూలై 1 నాటికి 21 సంవత్సరాలు నిండి, 35సంవత్సరాలలోపు ఉండాలని చెప్పారు. అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు 10వ తరగతి, ఆయా పోస్టులకు ఏడో తరగతి అర్హత ఉండాలని ఆమె తెలిపారు. ఈ అర్హతలు ఉన్నవారు తమ దరఖాస్తులను ఈ నెల 5వ తేదీ నుంచి 15వ తేదీలోపు కొరిశపాడులోని తమ కార్యాలయంలో అందజేయాలని కృష్ణకుమారి కోరారు. **వేమూరు :** వేమూరు నియోజకవర్గంలోని అమృతలూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు అర్హులైన మహిళలు దరఖాస్తులు చేసుకోవాలని సీడీపీఓ జి విజయలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. వేమూరు-5 కేంద్రంలో 1 పోస్టు బిసి-ఇ, కొల్లూరు మండలం రవికంపాడు-2లో ఎస్‌టి, కిష్కిందపాలెం-1లో ఓసి, దోనెపూడి-3లో ఓసి, భట్టిప్రోలు మండలంలో భట్టిప్రోలు వడ్డెర సంఘం కేంద్రం బిసిఎ, పెదపులివర్రు గ్రామం జీలుగువారిపాలెం ఎస్‌సి, అమృతలూరు మండలం కెటి పల్లి ఓసికు, చుండూరు మండలం దుండిపాలెం-4 ఎస్‌సికు రిజర్వ్ చేసినట్లు తెలిపారు. 7వ తరగతి పాసై, అదే గ్రామానికి చెందిన వారై ఉండాలని అన్నారు. వయస్సు 18 నుంచి 35 ఏళ్ల లోపు ఉండాలని అన్నారు. పుట్టినతేదీ, కుల ధ్రువీకరణ, విద్యార్హత, నివాస ధ్రువీకరణ, ఆధార్‌తో పాటు అదనపు విద్యార్హతలు ఉంటే వాటిని జతపర్చి ఈ నెల 15 తేదీ సాయంత్రం 5 గంటల లోపు అమృతలూరు ఐసిడిఎస్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. **ఇంకొల్లు రూరల్ :** ఐసిడిఎస్ ఇంకొల్లు ప్రాజెక్టు పరిధిలోని కారంచేడులో రెండు ఆయా పోస్టులు ఉన్నట్లు ఇంకొల్లు సిడిపిఓ టి రూన్సీ ఒక ప్రకటనలో తెలిపారు. కారంచేడు-2, కారంచేడు-9 సెంటర్లలో ఆయా పోస్టులు ఖాళీ ఉన్నట్లు వివరించారు. ఆసక్తిగల వారు ఈ నెల 5వ తేదీ నుంచి 15వ తేదీలోపు ఇంకొల్లు ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సిడిపిఓ కోరారు.

వృద్ధురాలిపై కత్తితో దాడి

ప్రజాశక్తి-కొండపి

మద్యం మత్తులో కోడి కోసం వెళ్లిన ఓ వ్యక్తి దాని ధర డబ్బులు చెల్లించమని అడిగిన వృద్ధురాలిపై కత్తితో దాడి చేసిన సంఘటన మండలంలోని అనకర్లపూడి గ్రామంలో గురువారం జరిగింది. కొండపి ఎస్ఐ వైవి రమణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుంచాల శ్రీను తన కుటుంబంతో 6 ఏళ్ల నుంచి శ్రీకాళహస్తిలో బేల్దారీ పనులు చేసుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడి తల్లి సుబ్బులు ఒక్కతే అనకర్లపూడి గ్రామంలో వాళ్ల నివాసంలో నాటు కోళ్లు పెంచుకొంటూ ఒంటరిగా జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో పక్కనే నివాసముండే మద్రిపూడి వీరయ్య అనే వ్యక్తి మంగళవారం రాత్రి 11.30 గంటల సమయంలో మద్యం తాగి, నాటు కోడి ఇవ్వాలని సుబ్బులుతో వాగ్వాదానికి దిగాడు. కోడి ధరకు డబ్బులు చెల్లించనిదే ఇవ్వనని వృద్ధురాలు తెల్చి చెప్పింది. దాంతో మాటా మాటా పెరగడంతో మద్యం మత్తులో కోపంతో వెంట తెచ్చుకున్న కత్తితో వీరయ్య వృద్ధురాలిపై దాడి చేశాడు. ఈ దాడితో వృద్ధురాలి తలకు, చేతులకు కాళ్లకు, మొహంపై గాయాలయ్యాయి. వెంటనే గమనించిన స్థానికులు 108 సాయంతో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. బాధితురాలి కుమారుడు శ్రీను ఫిర్యాదు మేరకు ఎస్ఐ వైవి రమణయ్య కేసు నమోదు చేశారు. బాధితురాలి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలియజేశారు.


ఒంగోలు రిమ్స్‌లో చికిత్స పొందుతున్న వృద్ధురాలు

యువకుడికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-అద్దంకి

ట్రాక్టర్-ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో యువకుడు తీవ్రంగా గాయపడిన ఘటన గురువారం జరిగింది. మండలంలోని కొత్త కొటికల పూడి-తిమ్మారెడ్డిపాలెం గ్రామాల మధ్యలో ఈ ప్రమాదం జరిగింది. కొత్త కొటికలపూడి గ్రామానికి చెందిన తిప్పా బత్తిన రామాంజనేయులు వ్యక్తిగత పనులపై బయటికి వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం సంభవించిందని స్థానికులు తెలిపారు. స్థానికుల సమాచారంతో 108 వాహనంలో క్షతగాత్రులను అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. యువకుడి పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


గాయపడిన ఆంజనేయులు

చట్టాలపై అవగాహన అవసరం : సిఐ

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్


చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సిఐ సూర్యానారాయణ

చట్టాలపై ప్రజలకు అవగాహన ఉండాలని ఇంకొల్లు సిఐ వి సూర్యనారాయణ అన్నారు. ఇంకొల్లు మండలం వంకాయలపాడు గ్రామంలో దిశ చట్టంతో పాటు పలు చట్టాలను గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. చట్టాలపై అవగాహన ఉంటేనే నేరాలు నియంత్రణ అవుతాయన్నారు. తప్పనిసరిగా ప్రజలు చట్టాలపై పూర్తి అవగాహన పెంచుకోవాలని కోరారు. దిశ యాప్‌ను స్మార్ట్ ఫోనుల్లో పొందుపరచి వాడే విధానాన్ని గురించి ప్రజలకు వివరించారు. ఆయన వెంట ఇంకొల్లు ఎస్ఐ షేక్ నాయబ్ రసూల్, మహిళా పోలీసులు, సిబ్బంది ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి మహిళ మృతి

ప్రజాశక్తి-ముండ్లమూరు: ముండ్లమూరు మండలంలోని మక్కెనేనివారి పాలెం గ్రామంలో గురువారం ట్రాక్టర్ బోల్తా పడి మహిళ మృతి చెందింది. అందిన వివరాల ప్రకారం.. మక్కెనవారిపాలెం గ్రామానికి చెందిన చావా వెంకటేశ్వర్లు తల్లి ద్రాక్షాయమ్మ, భార్య హైమావతి పూరిమెట్ల రోడ్డులో ఉన్న పొలంలో కలుపు తీసి ముగ్గురు ట్రాక్టర్‌పై తిరిగి ఇంటికి వస్తున్నారు. ఈ సమయంలో ట్రాక్టర్ కాలువ ఎక్కే క్రమంలో టైరు జారి తిరగబడింది. ఈ ప్రమాదంలో చావా హైమావతి(46) అక్కడికక్కడే మృతి చెందగా ద్రాక్షాయమ్మ, వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వినుకొండలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించి చికిత్స చేయిస్తున్నారు.

జూదరుల అరెస్టు

ప్రజాశక్తి-పొన్నలూరు: పొన్నలూరు మండలంలోని ఉప్పలదిన్నె గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను తన సిబ్బందితో కలిసి అరెస్టు చేసినట్లు ఎస్ఐ దాసరి రాజారావు గురువారం తెలిపారు. పేకాట ఆడుతున్న వారి నుంచి రూ.1210 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కూల్ డ్రింక్ షాపులో మద్యం బాటిళ్లు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

కూల్‌డ్రింక్ షాపులో అక్రమంగా నిల్వ ఉంచి విక్రయాలు జరుపుతున్న వ్యక్తిని ఎస్‌ఈబి అధికారులు అదుపులోకి తీసుకొని 37 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. పర్చూరు ఎస్‌ఈబి ఎస్ఐ శివరాం ప్రసాద్ గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రం మార్టూరు కొణిదెన రోడ్డులో కూల్‌డ్రింక్ షాప్ నిర్వహిస్తున్న తన్నీరు బజారుబాబు కూల్ డ్రింక్స్‌తో పాటు అక్రమంగా మద్యం విక్రయాలు జరుపుతున్నాడనే సమాచారం అందుకున్న ఎస్‌ఈబి అధికారులు దాడులు నిర్వహించి కూల్ డ్రింక్స్ నిల్వ ఉంచే ఫ్రిడ్జ్‌లో వాటర్ క్యాన్ మధ్య దాచి ఉంచిన 37 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని బజారు బాబుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఈబి ఎస్ఐ తెలిపారు.

ఆలయంలో చోరీకి విఫలయత్నం

ప్రజాశక్తి-దొనకొండ: స్థానిక బ్రహ్మారావుపేటలోని సాయిబాబా ఆలయంలో బుధవారం రాత్రి చోరీకి విఫలయత్నం చేసిన సంఘటన చోటు చేసుకుంది. తెలిసిన సమాచారం మేరకు.. గుర్తు తెలియని వారు ఆలయం తాళాలు పగల కొట్టి లోనికి వెళ్లి హుండీని తెరిచారు. అందులో ఏమీ లేకపోవటంతో వెనుతిరిగి ఉంటారని, ఆలయంలో ఇతర వస్తువులు ఏమి పోలేదని సమాచారం. వరుస దొంగతనాలు జరుగుతుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

ప్రజాశక్తి-పర్చూరు: విద్యుత్ షాక్‌తో మహిళ మృతిచెందిన సంఘటన పర్చూరు మండలం వీరన్నపాలెంలో గురువారం జరిగింది. స్థానికులు అందించిన వివరాల ప్రకారం.. వీఆర్‌ఏగా పనిచేస్తున్న కిరణ్‌కుమార్ భార్య స్వరూప(30) ఉదయం ఇంటి బయట తీగపై బట్టలు ఆరేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు స్వరూపను పర్చూరు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే స్వరూప మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పర్చూరు ఎస్ఐ చెంచుప్రసాదు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆరుగురు అరెస్టు

ప్రజాశక్తి-దర్శి: మండలంలోని రాజంపల్లి శివారులలో ఆరుగురు వ్యక్తులు అచ్చుబొమ్మ ఆడుతుండగా దాడిచేసి పట్టుకున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.38,120 నగదును స్వాధీనం చేసుకున్నామని ఆయన వెల్లడించారు.

వేసవి శిబిరాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-పర్చూరు: వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు ఉపయోగించుకోవాలని పర్చూరు గ్రంథపాలకులు శ్రీనివాసరావు కోరారు. స్థానిక గ్రంథాలయంలో ఈ నెల 8 నుంచి జూన్ 11 వరకు ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పాఠకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పన్ను రద్దు సరే..! తొలగింపు సంగతేంటి?

- అక్రమ నిర్మాణ దుకాణాల పన్ను రద్దుకు కౌన్సిల్ ఆమోదం
- పన్ను వేసిన అధికారిపై చర్యలు శూన్యం
- మునిసిపల్ 3వ ఆర్ఐగా వస్తున్నానంటూ సదరు అధికారి ప్రచారం



మునిసిపల్ స్థలంలో అక్రమంగా నిర్మించిన మూడు దుకాణాలు

ప్రజాశక్తి-చీరాల

పట్టణంలోని పొలిమేర రోడ్డు మున్సిపల్ టౌన్ హాల్ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టి ప్రారంభించిన మూడు దుకాణాలకు మునిసిపాలిటీ విధించిన దుకాణాల పన్నులను రద్దు చేస్తున్నట్లు ఇటీవల జరిగిన కౌన్సిలర్ల సమావేశంలో కౌన్సిల్ తీర్మానించింది. అయితే అక్రమంగా నిర్మించిన షాపులకు మునిసిపల్ పన్నులు వేసిన తతంగంలో ఆమ్యామ్యాలు పుచ్చుకున్నట్లు ఆర్ఐపై అనేక ఆరోపణలు కూడా ఉన్నాయి. అయితే పత్రికా కథనాలతో, కౌన్సిలర్ల సమావేశంలో జరిగిన చర్చలతో తాత్కాలికంగా మరో విధులకు ఆ అధికారిని కేటాయించారు. అయితే చీరాల మునిసిపాలిటీలో గత కొన్ని నెలలుగా జూనియర్ అసిస్టెంట్‌గా ఉన్న సదరు అధికారి ఆర్ఐగా చలామణి అవుతూ పట్టణంలోని పలు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలకు పన్నులు వేస్తూ భారీ స్థాయిలో అందినకాడికి పుచ్చుకొని తన పై అధికారులను సైతం తన పంథాలో సంతృప్తి పరుస్తున్నట్లుగా సమాచారం. అయితే ఈ అధికారిని గత మార్చి నెలలో టౌన్ హాలు షాపు అక్రమ నిర్మాణాల విషయంపై పన్నులు వేయడంతో ఈ విషయం బయటకు వచ్చింది. వెంటనే స్పందించిన మున్సిపల్ అధికారులు ఆ జూనియర్ అసిస్టెంట్‌ను తాత్కాలికంగా విధుల నుంచి తప్పించి మరొక సీటు కేటాయించారు. ఈ రెండు నెలలుగా ఆ సీటులో అతను సంతకం వరకే పరిమితమై సరిగ్గా విధులు నిర్వహించకపోయినా అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఈ మధ్యకాలంలో ఆ అధికారి అధికార పార్టీ నాయకులను, మున్సిపల్ అధికారులను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డాడు. తమ వర్గానికి సంబంధించి తమ ప్రాంతంలో సుమారు 490 ఓట్లు ఉన్నాయని, తనకు మళ్లీ ఆర్ఐ సీటు ఇస్తే ఆ ఓట్లు అధికార పార్టీ నాయకులకు వేయించే ఏర్పాటు చేస్తానని అంటూ వివిధ ప్రైవేటు కార్యక్రమాలలో రాజకీయ నాయకులను కలిసి వారికి శాలువాలు, ఫ్లవర్ బొకేలు ఇచ్చి ప్రసన్నం చేసుకున్నట్లు తెలుస్తోంది. అలాగే బాపట్ల మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఓ అధికారి సహాయ సహకారాలతో మునిసిపల్ శాఖ మంత్రిని కూడా కలిసి తన గోడు వెళ్లబోసుకొన్నట్లుగా సమాచారం. ఆ అధికారి కంటే సీనియర్లుగా ఉన్న పలువురు అధికారులు చీరాల మున్సిపాలిటీలో పని చేస్తున్నప్పటికీ వారికి కాకుండా ఒక జూనియర్ అసిస్టెంట్ క్యాడర్‌లో ఉన్న ఆ వ్యక్తికి మళ్లీ ఆర్ఐగా సీటు కేటాయిస్తే మరిన్ని అక్రమాలు జరిగే అవకాశాలు లేకపోలేదు అంటూ చీరాల మున్సిపాలిటీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. అక్రమ దుకాణ నిర్మాణాలకు పన్నువేసిన ఆర్ఐపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? విచారణ ఏమైందో ఇంత వరకూ తేలని పరిస్థితి. సదరు అధికారి 2017లో విధులు నిర్వహించిన సమయంలో అన్నా క్యాంటీన్ పక్కన ఉన్న మున్సిపాలిటీ స్థలాలలో, దేవస్థాన స్థలాలలో పలువురి వ్యక్తుల పేరు మీద నకిలీ పత్రాలు సృష్టించి అక్రమంగా పన్నులు వేసి భారీ స్థాయిలో వసూళ్లకు పాల్పడినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. మార్కాపురంలో పలువురు బాధితులు సంబంధిత కార్యాలయం చుట్టూ ఇప్పటికీ తిరుగుతున్నారు. వారంతా త్వరలో చీరాల వచ్చి తాము కట్టిన సొమ్ము సదరు అధికారి దగ్గర వసూలు చేయడానికి ప్రయత్నం చేస్తున్నట్లుగా సమాచారం. ఇంతటి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆ అధికారి తిరిగి చీరాల మున్సిపాలిటీలో మూడో ఆర్ఐ గా వస్తున్నట్లు ప్రచారం చేసుకోవటం కొసమెరుపు. ఈ నేపథ్యంలో మున్సిపల్ టౌన్ హాల్ స్థలంలో ఆక్రమణలో ఉన్న మూడు దుకాణాలను మున్సిపల్ అధికారులు పన్ను రద్దు చేసినప్పటికీ వాటిని తొలగిస్తారా? లేదా? అనే ప్రశ్నలు పట్టణ ప్రజలలో చర్చనీయాంశంగా మారింది.

బుడా చైర్మన్ ప్రమాణ స్వీకారానికి భారీ ర్యాలీ

ప్రజాశక్తి-రేపల్లె/బాపట్ల

బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్‌గా నియమితులైన మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావు నియామకం హర్షణీయమని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ రావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం మల్లికార్జునరావును అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు బస్టాండ్ సెంటర్లో ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ర్యాలీని ప్రారంభించారు. ప్రమాణ స్వీకార మహెూత్సవానికి రేపల్లె నుంచి సుమారు 100 కార్లతో భారీ ర్యాలీతో బాపట్లకు చేరుకున్నారు. కార్యక్రమంలో మంత్రి మేరుగ నాగార్జున, ఎమ్మెల్యే కోన రఘుపతి, ఎమ్మెల్సీ పోతుల సునీత, చీరాల శాసనసభ్యులు కరణం బాలరామకృష్ణమూర్తి, చీరాల వైసీపీ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్, మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైసిపి నాయకులు అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న దేవినేని మల్లికార్జునరావు

సచివాలయ వ్యవస్థతో అభివృద్ధి

వైసీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాచిన కృష్ణ చైతన్య

ప్రజాశక్తి-పంగులూరు

సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో గ్రామీణ వ్యవస్థ అభివృద్ధి చెందుతుందని వైసీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, రాష్ట్ర శాప్ నెట్ చైర్మన్ బాచిన కృష్ణ చైతన్య అన్నారు. మండలంలోని కోటపాడు గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం కృష్ణ చైతన్య గ్రామంలో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్నెస్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల రాకతో గ్రామాల్లో అభివృద్ధి మొదలైందని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రజల వద్దకు ప్రభుత్వాన్ని తీసుకువచ్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని అన్నారు. సచివాలయ వ్యవస్థ వలన అనేకమంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు వచ్చాయని, పరిపాలన కూడా గ్రామంలోకి రావడంతో పాలన సులభం అయిందని, ప్రజలకు ఇబ్బందులు తొలగిపోయాయని అన్నారు. రైతు భరోసా కేంద్రం ద్వారా రైతులకు అవసరమైన సలహాలు సూచనలతో పాటు, విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ సామగ్రి మొదలైన వాటిని ప్రభుత్వం అందిస్తుందని, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంతోపాటు పంటలను కొనుగోలు చేసే విధంగా ఆర్బికేలను తీర్చిదిద్దినట్లు చెప్పారు. గ్రామీణ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు గ్రామాల్లో వెల్నెస్ సెంటర్లను అభివృద్ధి పరచాలని, ప్రజల ముంగిటకే వైద్యాన్ని తీసుకురావాలనే ఆలోచనతో జగన్మోహన్‌రెడ్డి ఉన్నారని అన్నారు. అనేక సంక్షేమ పథకాలతో ప్రజలతో నిరంతరం మమేకమైన జగన్మోహన్‌రెడ్డిని, ప్రజలు ఆశీర్వదించాలని, మరోసారి ముఖ్యమంత్రిగా ఆయనకు అవకాశం ఇవ్వాలని కోరారు, ఈ కార్యక్రమంలో ఎంపీపీ తేళ్ల నాగమ్మ, ఎంపీడీవో రమణమూర్తి, మండల ఉపాధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస్ రెడ్డి, గ్రామ సర్పంచి నారాయణ, మండల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రాయిని వెంకట సుబ్బారావు, వైసీపీ నాయకుడు మాజీ సర్పంచి ఎర్రం గోపాల్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ రామ్ కుమార్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.



కోటపాడులో గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న బాచిన కృష్ణ చైతన్య



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి నక్కా ఆనందబాబు

వధూవరులకు ఆనందబాబు ఆశీర్వాదం

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండలంలోని చింతమోటు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు గొర్రెపాటి రమేష్ కుమారుని వివాహ వేడుకల్లో మాజీమంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈయన వెంట వేమూరు నియోజకవర్గ టిడిపి నాయకులు పాల్గొన్నారు.



పాత్రికేయుడు కుర్ర వెంకటరామయ్యను సన్మానిస్తున్న రోటరీ క్లబ్ అధ్యక్షులు

పాత్రికేయుడికి ఘన సన్మానం

ప్రజాశక్తి-బల్లికురవ రూరల్

పాత్రికేయ రంగంలో 25 సంవత్సరాల నుంచి సేవలు అందిస్తున్న కుర్ర వెంకటరామయ్యకు రోటరీ క్లబ్ మార్టూరు వారి ఆధ్వర్యంలో పత్రిక స్వేచ్ఛ దినోత్సవ వేడుకల్లో భాగంగా కుర్ర వెంకటరామయ్యను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు కొర్రపాటి రాజారావు మాట్లాడుతూ సీనియర్ పాత్రికేయుడు కుర్ర వెంకటరామయ్య 25 సంవత్సరాలుగా పత్రికా రంగంలో ఎంతగానో కృషి చేస్తున్నారని అన్నారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. అలాగే ఇటీవల నక్కబొక్కలపాడు గ్రామంలో పేదలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన నేపథ్యంలో కళ్లజోళ్ళు అవసరమైన వారికి పత్రిక స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా 40 మందికి కళ్లజోళ్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా యూత్ చైర్మన్ రవి అంకమ్మ చౌదరి, సెక్రెటరీ మద్దుమాల కోటేశ్వరరావు, చెరుకూరు నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు, వైద్యులు పాల్గొన్నారు.

డాక్టర్ పున్నయ్య మృతి

ప్రజాశక్తి-మేదరమెట్ల



మేదరమెట్ల చుట్టుపక్కల గ్రామాల్లో మంచి డాక్టర్‌గా, పేదల డాక్టర్‌గా పేరొందిన మోపర్తి పున్నయ్య చౌదరి (87) గురువారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. ఈయన మేదరమెట్లలో సుమారు 55 సంవత్సరాలు వైద్యం అందించి పేదల దేవుడిగా పేరొందారు. ఈయనకు భార్య, కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు, కుమార్తె అమెరికాలో ఉన్నందువల్ల వారు వచ్చిన తరువాత శనివారం ఉదయం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబీకులు తెలిపారు. ఈయన తక్కువ ఖర్చుతో ఎంతటి రోగాన్నయినా తగ్గిస్తాడు అనే మంచి పేరు సంపాదించుకున్నారు. వేలకు వేలు నగదు గుంజుతున్న ఈ రోజులలో అతి తక్కువ ఖర్చుతో అనేకమందిని కరోనా బారి నుంచి, అనేక రోగాల నుంచి విముక్తి చేసి, ఈ ప్రాంత ప్రజల హృదయాల్లో నిలిచిపోయారు. ప్రముఖులు మతదేహాన్ని సందర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈయన స్వస్థలం ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం కొలచనకోట గ్రామం. అక్కడి నుంచి ఏమాత్రం వైద్యం అందని మేదరమెట్ల ప్రాంతానికి వచ్చి వైద్యాన్ని ఈ ప్రాంత ప్రజలకు సుదీర్ఘకాలం పాటు అందించారు.

'గుంటక' సేవలు స్ఫూర్తిదాయకం

జెవివి రాష్ట్ర పబ్లికేషన్ కన్వీనర్ సుబ్రమణ్యం

ప్రజాశక్తి-పెద్దారవీడు

జెవివి అభివృద్ధికి కామ్రేడ్ గుంటక సత్య నారాయణరెడ్డి చేసిన సేవలు స్ఫూర్తి దాయమకమని జెవివి రాష్ట్ర పబ్లికేషన్ కన్వీనర్ సుబ్రమణ్యం తెలిపారు. మండల పరిధిలోని సానికవరం గ్రామానికి చెందిన కామ్రేడ్ జెవివి కర్నూలు జిల్లా ప్రధా కార్యదర్శి గుంటక సత్యనారాయణరెడ్డి ద్వితీయ వర్ధంతి సభ స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్రమణ్యం మాట్లాడుతూ గుంటక సత్యనారాయణరెడ్డి అభ్యుదయ వాది అని తెలిపారు. యువతరాన్ని ఉత్తేజరచి జెవివి అభివృద్ధికి కృషి చేశారని గుర్తు చేశారు. గ్రామీణ ప్రజలకు విద్య, వైద్య, విజ్ఞానం అందించేందుకు ఆయన చేసిన కృషి అభినందనీయమన్నారు. దూరదృష్టితోనే సానికవరంలో పుచ్చలపలిల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సత్యనారాయణరెడ్డి మృతి జెవివికి తీరని లోటన్నారు. జెవివి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కర్నూలు జిల్లా పూర్వ అధ్యక్షుడు పి.ఖాజాహుస్సేన్ మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో గుంటక సత్యనారాయణరెడ్డి జెవివి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలను, పోరాటాలను గుర్తు చేశారు. సైన్స్ ద్వారా మూఢనమ్మకాలపై అవగాహన కల్పించ డంలో ప్రముఖపాత్ర పోషించారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో పాడిన పాటలు ఉత్సాహాన్ని ఇచ్చాయి. ఈ కార్యక్ర మంలో రైతు సంఘం రాష్ట్ర నాయకుడు గాలి వెంకటరామిరెడ్డి, మార్కాపురం డివిజన్ నాయకుడు డి.సోమయ్య, సిఐటియు నాయకుడు డికెఎం.రఫి, యుటిఎఫ్ నాయకుడు ఒద్దుల వీరారెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



సత్య నారాయణరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు

వర్షం కారణంగా పంటలు నష్టపోయిన

రైతులను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి-దర్శి

గత 10 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, వడగండ్ల వానకు రైతులకు పంట నష్టం జరిగిందని, బాధిత రైతులకు ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు కోరారు. స్థానిక సుందరయ్య భవనంలో సిపిఎం నాయకుడు సందు వెంకటేశ్వరరావు అధ్యక్షతన సిపిఎం మండల కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ గతంలో దర్శి ప్రాంతంలో రైతులు వరి పంట సాగు చేసేవారని తెలిపారు. వరి సాగు గిట్టుబాటు కాకపోవడంతో రైతులు ప్రస్తుతం వాణిజ్య, మెట్ట పంటలు సాగు చేస్తున్నట్లు తెలిపారు. వర్షాల కార ణంగా సాగులో ఉన్న మొక్కజొన్న, మిరప పంట, వరి, ఉద్యానవన పంట లకు నష్టం వాటినట్లు తెలిపారు. అధికారులు స్పందించి పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపి రైతులు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి రంగారావు, నాయకులు నారాయణ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

'దాచూరి'కి ఘన నివాళి

ప్రజాశక్తి-చీమకుర్తి

యుటిఎఫ్ ఉద్యమనిర్మాత, స్ఫూర్తిప్రదాత దాచూరి రామిరెడ్డి ఆశయాలు కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అని యటిఎఫ్ నాయకులు తెలిపారు. స్థాణిక యుటిఎఫ్ భవనంలో దాచూరిరామిరెడ్డి వర్ధంతి వారోత్సవాలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు యుటిఎఫ్ మండల అధ్యక్షుడు పేక్ అక్బర్ అధ్యక్షత వహించారు. తొలుత యుటిఎఫ్ నాయకులు రామిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామిరెడ్డి స్ఫూర్తితో ఉపాధ్యాయులు ఉద్యమ బాటలో నడవాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల కార్యదర్శి చలువాది శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు జి. వెంకటేశ్వర్లు, కోశాధికారి పర్వతం వెంకటేశ్వర్లు, యుటిఎఫ్ జిల్లా నాయకులు ఎస్కె.శిలార్, చల్లా శ్రీనివాస్, దోమల పుల్లయ్య, ఎస్కె.పీరు సాహెబ్,ఎస్. ప్రసాదు, పివి.కోటేశ్వరరావు, బొడ్డు బ్రహ్మయ్య, డి.రాము, ఎన్పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



వాహనాన్ని ప్రారంభిస్తున్న మారంవెంకారెడ్డి

బ్లడ్ సంజీవని వాహనం ప్రారంభం

ప్రజాశక్తి-చీమకుర్తి

ఆర్డిఎఫ్ (రెడ్ డ్రాప్ పౌండేషన్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బ్లడ్ సంజీవని వాహనాన్ని మద్దిపాడు ఎఎంసి మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి, జెవివి జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బి.జవహర్, చీమకుర్తి లయన్స్క్లబ్ అధ్యక్షుడు చలువాది బదరీ నారాయణ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తం అవసరమైన వారికి రక్తం ఇవ్వడానికి బ్లడ్ సంజీవని వాహనం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అవసరమైన వారికి రక్తం త్వరగా అందించడానికి ఆర్డిఎఫ్ సంస్థ నిర్వాహకుడు ఇస్తర్ల శంకర్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పి.గంగయ్య, ఎస్కె. ఖాదర్బాషా, బిసి నాయకులు అశోక్, బాబు, శేషు, దిశ పౌండేషన్ అధ్యక్షుడు నాగరాజు, వెంకటరావు, సాయి, పోలయ్య, హరీష్ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డిఒ

భూ సర్వేపై ఆర్డిఒ సమీక్ష

ప్రజాశక్తి- మద్దిపాడు

ఎలాంటి వివాదాలకు తావులేకుండా భూముల రీసర్వే నిర్వహించాలని ఒంగోలు ఆర్డిఒ విశ్వేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రెవెన్యూ కార్యాలయంలో భూముల రీసర్వేపై గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డిఒ మాట్లాడుతూ సంబంధిత రైతుల సమక్షంలో భూమలను సర్వే చేయాలన్నారు. అనంతరం మండల పరిధిలోని ఎడుగుండ్లపాడులో నిర్వహిస్తున్న భూ సర్వేను ఆర్డిఒ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు రజనీకుమారి, డిటీ వి వెంకటేశ్వర్లు సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

సేవకు ప్రతిరూపం 'కొండపి'

ప్రజాశక్తి-పొన్నలూరు

తనకు లభించే ఆదాయంతో పాటు అదనపు సంపాదన కోసం వెంపర్లాడుతున్న ఈ రోజుల్లో తనకు వచ్చే పింఛనుతో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్న డాక్టర్ కొండపి విశ్వేశ్వరరావు స్ఫూర్తి పదుగురికి ఆదర్శనీయం. 'సొంతలాభం కొంతమాని పొరుగువాడికి తోడుపడవోయ్' అన్న గురజాడ స్ఫూర్తికి బలం చేకూర్చారు ఆయన. పొన్నలూరుకు చెందిన విశ్వేశ్వరరావు కేంద్ర ప్రభుత్వంలో చిరుఉద్యోగిగా 12ఏళ్ల క్రితం రిటైర్ అయ్యారు. 1982లో ఇక్కడకు బదిలీపై వచ్చిన ఆయన స్థానికంగా ఉంటూ ఈ ప్రాంత ప్రజలకు చేరువయ్యారు. అందుకేనేమో ఉద్యోగ విరమణ అనంతరం తన స్వగ్రామం వెళ్ళకుండా స్థానికంగా అదె్ద ఇంట్లోనే ఉంటూ తనకు ప్రభుత్వం నుంచి వచ్చే పెన్షనులో అత్యధిక మొత్తం ప్రజాహిత కార్యక్రమాలకు వెచ్చిస్తున్నారు.



కొండపి విశ్వేశ్వరరావు



విశ్వేశ్వరరావు అందుకున్న పురస్కారాలు

కమ్యూనిస్టు నేపథ్యంలో....

విశ్వేశ్వరరావు ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం దొడ్డవరం గ్రామానికి చెందిన కొండపి వీరబ్రహ్మాచారి సుబ్బాయమ్మకు నాలుగవ సంతానం. స్థానికంగా ఎస్ఎస్-ఎల్సి పూర్తి చేశారు. అప్పట్లో ఇక్కడ కమ్యూనిస్టుల ప్రాబల్యం ఎక్కువగా ఉండేది. వారు నిర్వహించే ప్రజాహిత కార్యక్రమాల పట్ల ఆయన ఆకర్షితులయ్యేవారు. చదువు అనంతరం 1970 ప్రాంతంలో ఒంగోలు జాన్ వెస్లి మిషనరీ స్కూల్ లో 'ఆఫీస్ హెల్ప్ హ్యాండ్' పోస్టులో జాయిన్ అయ్యారు. 1972 ప్రాంతంలో అప్పటి బాపట్ల ఎంపీ అంకినీడు వరప్రసాదరావు సిఫార్సుతో ఒంగోలు తాలూకా కార్యాలయంలో సెక్షన్ రైటర్గా చేరారు. 1974లో ఎంప్లాయిమెంట్ ద్వారా కేంద్ర ప్రభుత్వ రంగంలో అగ్రికల్చరల్ ఫీల్డ్ మెన్గా రాజమండ్రి సమీపంలో కాతేరులో ఉద్యోగంలో చేరారు. 3 ఏళ్ల అనంతరం టంగుటూరు, సంద్రపాడు, ప్రాంతాలలో పనిచేశారు. అనంతరం నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం కె.యడవల్లికి బదిలీ అయ్యారు.

గ్రామానికి విద్యుత్తు ఏర్పాటు లో....

విశ్వేశ్వరావు యడవల్లిలో పనిచేసేటప్పుడు గ్రామంలో కలరా సోకింది. విషయాన్ని స్వయంగా అప్పటి నెల్లూరు ఆర్డిఒ, ఎమ్మెల్యే సుందరరామిరెడ్డికి టెలిగ్రాం ద్వారా సమాచారం ఇచ్చారు. వెంటనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రాణనష్టం జరగకుండా చేశారు. ఈయన పనితీరు గుర్తించిన ఎమ్మెల్యే ఏదైనా సాయం చేస్తానని సూచించారు. విద్యుత్ లేని యడవల్లికి విద్యుత్ సౌకర్యం కల్పించమని విశ్వేశ్వరరావు కోరారు. ఈయన సామాజిక స్పృహ పై స్పందించిన సుందరరామిరెడ్డి వారం తిరక్కుండానే గ్రామానికి విద్యుత్తు వసతి కల్పించారు.

మూడు దశాబ్దాలుగా ప్రజాహిత కార్యక్రమాలు..

1982లో పొన్నలూరు కు బదిలీ పై వచ్చిన విశ్వేశ్వరరావు ఈ ప్రాంత ప్రజలకు చేరువయ్యారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు, రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులకు దగ్గరయ్యారు. ప్రభుత్వం నిర్వహించే పలు కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు. స్వచ్ఛందంగా పలు ప్రజాహిత కార్యక్రమాలను నిర్వహించడం లో ముందుండేవారు..

జూనియర్ కళాశాల ఏర్పాటులో...

తొలుత ఇక్కడ ప్రభుత్వం జూనియర్ కళాశాలను మంజూరు చేసినపుడు ఈయన స్థానికులను చైతన్య పరచి తన స్వంత ఖర్చుతో పాటు నిధులు సమకూర్చి షెడ్లు నిర్మాణం చేపట్టారు. కళాశాల ఏర్పాటుకు ఆటంకం కలిగించాలని కొందరు వ్యక్తులు ప్రయత్నం చేసినా విశ్వేశ్వరరావు అడ్డుకోగలిగారు. కళాశాల అభివద్ధి కమిటీ చైర్మన్గా నిన్నటి వరకు కొనసాగారు. ప్రతిఏటా ఇంటర్లో 900పైగా మార్కులు సాధించిన వారికి బంగారు పతకం అందజేస్తున్నారు. కళాశాలకు సొంత నిధులతో విద్యుత్ సౌకర్యం కల్పించారు. డయాస్ నిర్మించారు.ప్రతి మేడే నిర్వహణలో ఈయన ముందుంటారు. ఆశ్రమ పాఠశాల తో పాటు బాలిరెడ్డి పాలెం పాఠశాలకు ఉచితంగా మైక్ సెట్లు అందించారు. అవసరమైన పాఠశాలల విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. పేద విద్యార్థులకు 100 మందికి పైగా ఫీజులు చెల్లించారు. గ్రంథాలయం అభివద్ధి, పలు పాఠశాలల అభివృద్ధి లో కీలక పాత్ర పోషించారు.

మెడికల్ క్యాంపుల నిర్వహణలో...

గత ఇరవై ఏళ్లుగా స్థానికంగా మెడికల్ క్యాంపుల నిర్వహణలో కీలక భూమిక పోషిస్తున్నారు. 100 మందికి పైగా రోగులకు కంటి శస్త్రచికిత్సలు చేయించారు. 15 మంది పేద మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు.

గౌరవ డాక్టరేట్...

విశ్వేశ్వరరావు సేవలను గుర్తించిన మేజిక్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఢిల్లీ సంస్థ గత ఏడాది డిశంబర్లో గౌరవ డాక్టరేట్ తో సత్కరించింది. 2007లో విశాఖపట్నంలో ఆంధ్రరత్న అవార్డు అందించారు. 2009లో బెస్ట్ సిటిజన్, 2012లో డైమండ్ సిటిజన్ సత్కారాన్ని అందుకున్నారు. 2003 నుంచి కాకతీయ అన్నదాన సత్రం గౌరవ సలహాదారుగా కొనసాగుతున్నారు. రోటరీక్లబ్ సభ్యునిగా కొనసాగటం విశేషం.గతంలో రెడ్ క్రాస్ సంస్థ కార్యదర్శి గాపనిచేశారు. గుజరాత్ అల్లర్లు జరిగినప్పుడు భూరివిరాళాన్ని అందించటంతోపాటు కొంతమంది ద్వారా నిధులు సమీకరించి ప్రభుత్వం ద్వారా అందించారు. డాక్టర్ కొండపి విశ్వేశ్వరరావు స్ఫూర్తి అందరికీ ఆదర్శమే....

శ్రీపృథులగిరి అభివృద్ధికి కృషి



కేశఖండన మండపాన్ని ప్రారంభిస్తున్న కుప్పం, మారం వెంకారెడ్డి

ప్రజాశక్తి మర్రిపూడి

శ్రీపృథులగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయ అభివద్ధికి కషి చేస్తామని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల పంచాయతీరాజ్ వింగ్ రీజనల్ కోఆర్డినేటర్ వాకా వెంకటరెడ్డి తెలిపారు. అన్నారు. శ్రీపృథులగిరిపై పలు అభివృద్ధి కార్యక్రమాలకు గురువారం ప్రారంభోత్సం చేశారు. తొలుత సత్రాల వద్ద నుంచి స్వామి వారి గర్భగుడి వద్దకు దాతల సహకారంతో తారురోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం దాతల సహకారంతో ఏర్పాటు చేసిన త్రీఫేస్ ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ ఎస్ఇ కె. సత్యనారాయణ చేతుల మీదుగా ప్రారంభించారు. తాటికొండ వెంకటకృష్ణమూర్తి, ఆయన ధర్మపత్ని ఝాన్సీ సహకారంతో నిర్మించిన కేశఖండన మండపాన్ని మద్దిపాడు మాజీ ఎఎంసి చైర్మన్ మారం వెంకారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు.అనంతరం కుప్పం ప్రసాద్, వాకా వెంకటరెడ్డి మాట్లాడుతూ శ్రీపృథుల గిరి క్రింద నుంచి సత్రాల వరకు ఘాట్ రోడ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. అందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కుప్పం కొల్లారావు, శిద్దా సూర్య ప్రకాష్, ఇఒ శ్రీనివాసరావు, వావిగుళ్ల రామారావు, శిద్దా నాగేశ్వరరావు, రావూరి జనార్ధన్, సుబ్రమణ్యం, ఆలపాటి శ్రీరామ్, ఇంకొల్లు పిచ్చిరెడ్డి, చలువాది బద్రీనారాయణ, బోదా రమణారెడ్డి, రేగుల వీరనారాయణ, ఇనుకొల్లు సుబ్బారెడ్డి, ఇనుకొల్లు మాదిరెడ్డి, కాటూరి ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

శ్రీపృదులగిరిపై వేంచేసిన శ్రీ లక్ష్మి నృశింహస్వామి జయంతి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పమిడి వెంకట కృష్ణమూర్తి, ధర్మపత్ని ఝాన్సీలక్ష్మి ఉభయదాతలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

లోకోస్ మొబైల్ యాప్‌పై శిక్షణ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

లోకోస్ మొబైల్ యాప్‌తో సంఘ సభ్యుల లావాదేవీల సమచారాన్ని సులభంగా తెలుసుకోవచ్చు వైఎస్ఆర్ క్రాంతి పథం మండల మహిళ సమాఖ్య ఎపిఎం నూనె వెంకటయ్య తెలిపారు. పుల్లలచెరువు మండల పరిషత్ కార్యాలయంలో లోకోస్ మొబైల్ యాప్‌పై విఒఎలకు రెండు రోజులపాటు నిర్వహిస్తున్న శిక్షణా తరగుతులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ ఇక నుంచి దేశ వ్యాప్తంగా లోకోస్ యాప్ ద్వారా సంఘ సభ్యుల లావాదేవీలు తెలుసుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనర్లు రంగనాయకులు, రవి కిరణ్, చార్లెస్,విఒఎలు పాల్గొన్నారు.

6న మండల సమావేశం

ప్రజాశక్తి-దర్శి

దర్శి మండల సర్వసభ్య సమావేశం ఈనెల 6న ఎంపిపి గోళ్లపాటి సుధారాణి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కుసుమకుమారి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న సమావేశానికి మండల పరిధిలోని ఎంపిటిసిలు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఎంపిడిఒ కోరారు.

సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి-సిఎస్‌పురం

సిఎస్‌పురం మండలం పెదరాజుపాలెం పంచాయతీ పరిధిలోని తిమ్మారాజుపల్లి గ్రామానికి చెందిన ధనేకుల చిన్నారావుకు శస్త్ర చికిత్స కోసం రూ.10 లక్షలు మంజూరయ్యాయి. బాధితుడికి ఎమ్మెల్యే బుర్రా మధు సూదనరావు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో గ్రామ సర్పంచి పందిళ్ల నాగమణి, పుల్లయ్య చేతుల మీదుగా రూ.10లక్షల చెక్కును గురువారం అందజేశారు.

పొగాకు బేళ్లు తిరస్కరణ

ప్రజాశక్తి-కొండపి

కొండపి పొగాకు వేలం కేంద్రానికి మండలపరిధిలోని కట్టావారిపాలెం, నర్సింగోలు గ్రామాలకు చెందిన రైతులు 1,095 పొగాకు బేళ్లను గురువారం అమ్మకానికి తెచ్చారు. అందులో 1,022 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 73 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.200, అత్యల్ప ధర రూ.150, సరాసరి ధర రూ.195.80పైసలు పలికినట్లు వేలం నిర్వహణా ధికారి ఎస్.రామారావు తెలిపారు. **మద్దిపాడు :** వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రానికి మండల పరిధిలోని నందిపాడు, నాగన్న పాలెం, రాచవారి పాలెం గ్రామాలకు చెందిన రైతులు గురువారం 1,233 పొగాకు బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 1,130 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 103 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.200, అత్యల్ప ధర రూ.160, సరాసరి ధర రూ. 195-19పైసలు పలికినట్లు ఎఎస్ఒ శ్రీనివాసరావు తెలిపారు.

నాడు- నేడు పనులపై సమీక్ష

ప్రజాశక్తి -శింగరాయకొండ

స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో నాడు-నేడు పనులపై గురువారం సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎంఇఒ బి. శివన్నారాయణ మాట్లాడుతూ నాడు- నేడు పథకం ద్వారా పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తయ్యేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. అభివృద్ధి పనులు జూన్ 12 నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇ, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

అశోక్‌బాబును కలిసిన సిఐ

ప్రజాశక్తి-టంగుటూరు

కొండపి సిఐగా వై.పాండురంగారావు ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. అందులో భాగంగా వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబును స్థానిక ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొండపి సర్కిల్ పరిధిలోని పలు సమస్యలపై వారు కొద్దిసేపు చర్చించారు. ఈ కార్యక్రమంలో జెసిఎస్ మండల కన్వీనర్ చింతపల్లి హరిబాబు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పిసిపల్లి

పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాద్ తెలిపారు. మండల పరిధిలోని తలకొండపాడు గ్రామ సచివాలయం పరిధిలోని ఎస్‌సి కాలనీ, పాలేటిపల్లి, చిలుకూరువారిపల్లి గడప గడపకూ మన మనప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం అకాల వర్షానికి కల్లాల్లోనే తడిసిన మిర్చిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అత్యాల జఫన్య, మురుగుమ్మి ఎంపిటిసి చెరుకూరి సతీష్, సచివాలయాల కన్వీనర్ శీలం సుదర్శనం, ఎంపిటిసి భూమిరెడ్డి కొండారెడ్డి పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రంలో పరిశీలన



సంపద తయారీ కేంద్రంలో పరిశీలిస్తున్న డిపిఒ

ప్రజాశక్తి-టంగుటూరు

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వ హణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా చర్యలు తీసు కోవాలని జిల్లా పంచాయతీ అధికారి నారాయణరెడ్డి ఆదేశి ంచారు. టంగుటూరు స్థానిక ఉత్తర బైపాస్ సర్వీస్ రోడ్డు సమీపంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని డిపిఒ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పంచా యతీ కార్యదర్శులకు ఎస్‌డబ్ల్యుపిసి కేంద్రాల నిర్వహణ, పనితీరుపై దిశా నిర్దేశం చేశారు. తడి, పొడి చెత్తలను వేరు చేసి వినియోగించాలన్నారు. గ్రామ పంచాయతీలలో వర్మీ కంపోస్ట్ తయారీని కార్యదర్శులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్ర మంలో ఇఒపిఆర్‌డి, టంగుటూరు పంచాయతీ కార్యదర్శి నర్రా జగదీష్ బాబు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే 'ఉగ్ర'

ప్రజాశక్తి-వెలిగండ్ల

మండల పరిధిలోని రాళ్లపల్లి గ్రామానికి చెందిన తెలుగు రైతు సంఘ అధ్యక్షుడు మీనిగా కాశయ్య కుమార్తె మౌనిక వివాహ వేడుకలు గురువారం జరిగాయి. ఈ వేడుకల్లో టిడిపి కనిగిరి నియోజక వర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పాల్గొని నూతన వధువును ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, టిడిపి నాయకుడు శ్యామల కాశిరెడ్డి, టిడిపి నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ షరీఫ్, తెలుగు యువత అధ్యక్షుడు కర్నాటి భాస్కర్‌రెడ్డి, మొటాటి సుబ్బారెడ్డి, కొండు భాస్కర్‌రెడ్డి, కేసరి రమణారెడ్డి, బత్తుల తిరుపతిరెడ్డి, బత్తుల నారాయణరెడ్డి, డిసిఎంఎస్ మాజీ అధ్యక్షుడు బీరం వెంకటేశ్వర్‌రెడ్డి, రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం : వరికూటి



మాట్లాడుతున్న అశోక్‌బాబు

ప్రజాశక్తి-టంగుటూరు

జగనన్న లేఅవుట్లలో అన్ని మౌళిక వసతులు ఉంటేనే లబ్ధిదారులు గహ నిర్మాణాలకు ముందు కొస్తారని వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్ బాబు అభిప్రాయపడ్డారు. స్థానిక మండల పరిషత్ కార్యాల యంలో జగనన్న లేఅవుట్లలో గహ నిర్మాణాలపై అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ బాబు మాట్లాడుతూ జగనన్న లే అవుట్లలో తాగునీరు, విద్యుత్, అంతర్గత రోడ్లు తదితర వసతుల కల్పనపై అధికారులతో చర్చించారు. అనంతరం అశోక్ బాబు మాట్లాడుతూ మండల పరిధిలోని కొన్ని గ్రామాలలో ఇప్పటికీ ఒక్క ఇల్లు నిర్మాణం కూడా ప్రారంభం కాని లేఅవుట్లు ఉన్నాయన్నారు. గహ నిర్మాణాలకు ఆటంకం కలిగించే సమస్యలపై అధికారులు దష్టి సారించి లబ్ధిదారులందరూ నిర్మా ణాలను ప్రారంభించేలా చర్యలు తీసు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు, రాష్ట్ర ఎంబిసి కార్పొరేషన్ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు, తహశీల్దారు కె.సంజీవరావు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ రత్నజ్యోతి, గహ నిర్మాణ శాఖ డిఇఇ పాటిబండ్ల జయరావు, ఎఇ రియాజ్, ఆర్‌డబ్ల్యుఎస్, ఎన్ఆర్ఇజిఎస్, పంచాయతీ రాజ్ ఎఇలు సుబ్బారావు, సుభాషిణి, కోట శ్రీహరి, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ గుంజి రాంబాబు, ఎపిఎం హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ నాయకుడు రామచంద్రయ్య మృతి

ప్రజాశక్తి-కొండపి



రామచంద్రయ్య (ఫైల్)

మండల పరిధిలోని పెరిదేపి గ్రామానికి యుటిఎఫ్ నాయకుడు పుట్టా రామచంద్రయ్య అనారోగ్యంతో గురువారం మృతిచెందాడు. ఆయన మృతదేహాన్ని సిఐటియు జిల్లా నాయకుడు గంటనపల్లి శ్రీనివాసులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో పుట్టా వెంకట శేషయ్య, పుట్టా బ్రహ్మయ్య, పుట్టా గోవిందమ్మ, మద్దినేని రామారావు, గంగుల ఆంజనేయులు, బివికె. కృష్ణ , పమిడి వెంకటేశ్వర్లు ఉన్నారు.

దంపతులకు ఎమ్మెల్యే స్వామి ఆశీర్వాదం



దంపతులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే స్వామి

ప్రజాశక్తి- జరుగుమల్లి

జరుగుమల్లి మండలం చింతపాలెం గ్రామానికి చెందిన మాజీ మంత్రి నలమోతు చెంచు రామా నాయుడు మనవడు చెంచు రామానాయుడు, ఉజ్వల వివాహావేడుకలు ఇటీవల జరిగాయి. నూతన వధూ వరులను కొండపి ఎమ్మెల్యే డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య గురువారం ఆశీర్వదించారు. అనంతరం మండల పరిధిలోని చిరికూర పాడు గ్రామానికి చెందిన గుండపనేని వెంకటేశ్వర్లు, సుజాత దంపతుల కుమారుడు చైతన్య వివాహా వేడుకలకు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల మాజీ కన్వీనర్ నలమోతు వెంకటేశ్వర్లు, నలదల రామారావు, గుండపనేని వెంకటేశ్వర్లు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

తడిసిన ఇటుక రాయి.. ఆందోళనలో యజమానులు

ప్రజాశక్తి-కొల్లూరు

నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ఇటుకరాయి తడిసిపోయింది. దీంతో యాజమాన్యంతో పాటు కూలీలు కూడా ఇబ్బంది పడుతున్నారు. తడిసిపోయిన రాయి తడిసిపోగా గుట్టలు వేసి పట్టాలు కప్పిన రాయిని పట్టాలు తీసి ఆరబెట్టుకుందామంటే వర్షాలు తగ్గటం లేదని రైతులు వాపోతున్నారు. వర్షాలు చెదురుమదురుగా పడుతూనే ఉన్నాయి. దీనికితోడు రా మెటీరియల్ ధర బాగా పెరగడం, సంవత్సరం ముందే ఇతర జిల్లాల నుంచి వచ్చే వలస కూలీలకు అడ్వాన్స్‌గా డబ్బులు ఇవ్వడం, ఈ వర్షాలకు ఈ కూలీలు ఎక్కడ సొంత జిల్లాలకు వెళ్లిపోతారో అనే భయంతో యజమానులు ఉన్నారు. ఈ సంవత్సరం తీయాల్సినంత రాయి తీయకపోగా పెట్టిన పెట్టుబడి కూడా రాదేమోనని ఇటు రాయి యజమానులు ఆందోళన చెందుతున్నారు.

పర్చూరు: అకాల వర్షాలు రైతులను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. బుధవారం నుంచి వర్షపు జల్లులు పడుతూనే ఉన్నాయి. పర్చూరు మండలం నూతలపాడు, జాగర్లమూడి తదితర ప్రాంతాల్లో కుండపోత వర్షం పడింది. పంటలను రక్షించుకునేందుకు రైతన్నలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కొన్నిచోట్ల పట్టలు కప్పేలోపే మిరప కాయలు నీటి పాలయ్యాయి. ఏం చేయాలో పాలుపోక ఆకాశంవైపు చూస్తూ రైతులు కాలం వెళ్లదీస్తున్నారు.



ఇటుకలకు పట్టా కప్పిన దృశ్యం

సమయపాలన పాటించని సచివాలయ సిబ్బంది

ప్రజాశక్తి-పొన్నలూరు

పొన్నలూరు గ్రామ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గురువారం ఉదయం 10:30 గంటల సమయంలో ప్రజలు సచివాలయానికి వెళ్లారు. అయితే అప్పటికీ అధికారులు రాకపోవడంతో వారు నిరాశతో వెనుదిరిగారు. ఉన్నతాధికారులు స్పందించి సచివాలయ సిబ్బంది సకాలంలో వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మాదకద్రవ్యాల వినియోగాన్ని వ్యతిరేకించండి

ప్రజాశక్తి-పంగులూరు



సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగిస్తున్న రేణింగవరం ఎస్ఐ

మాదకద్రవ్యాల వినియోగాన్ని యువత వ్యతిరేకించాలని, దానిని అరికట్టి సరైన మార్గంలో యువత నడవాలని, రేణింగవరం ఎస్ఐ కేకే తిరుపతిరావు కోరారు. బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు, గురువారం మం డలంలోని అలవలపాడు గ్రామంలో విలేజ్ విజిటింగ్ కార్యక్రమంలో భాగంగా యువకులతో ఆయన మాట్లాడారు. సైబర్ నేరాల పట్ల, మాదకద్రవ్యాల వినియోగం పట్ల యువకులు అప్రమత్తంగా ఉండాలని, లేకుంటే అనేక సమస్యలకు గురవుతారని అన్నారు. యువకులు చక్కగా చదువుకొని, మంచి ఉద్యోగాలు చేస్తూ, భవిష్యత్తును బంగారు బాటగా తీర్చిదిద్దుకోవాలని కోరారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలకు యువత బలివుతుందని, కొంతమంది యువతను తప్పుదారి పట్టించేందుకు, మారకద్రవ్యాలను ఉపయోగించే విధంగా చేస్తున్నారని తిరుపతి రావు అన్నారు. సమాజానికి ఉపయోగపడే విధంగా యువత ఉండాలని, నేరాలకు, మాదక ద్రవ్యాల వినియోగానికి పాల్పడకూడదని చెప్పారు. నేరాల నియంత్రణలో భాగంగా సీసీ కెమెరాలు, వాటి ప్రాముఖ్యతను గురించి ఎస్ఐ వివరించారు. అలవలపాడు గ్రామంలో 8 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు సరైన ప్రాంతాలను గుర్తించినట్లు ఎస్ఐ తిరుపతిరావు తెలిపారు.

అధికారుల చొరవతో దారి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి- కొత్తపట్నం: కొత్తపట్నం మండలం రంగాయపాలెం పంచాయతీ పరిధిలోని క్రాంతి నగర్‌లో స్మశాన వాటిక వెళ్లే రహదారి, రైతులు పొలాలకు వెళ్లే దారి విషయంలో వివాదం చేలరేగింది. దీంతో గ్రామస్తులు, రైతుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో తహశీల్దారు పివి రమణారావు, ఎంపిడిఓ సుజాత, ఎస్ఐ సాంబశివరావు వివాదా స్పదంగా మారిన స్థలాన్ని గురువారం పరిశీలించారు. గ్రామస్తులు, రైతులతో సమావేశం నిర్వహించారు. అనంతరం శ్మశాన వాటికలో వెళ్లే రహదారి, రైతులు పొలానికి వెళ్లే బాటను సర్వే చేయించారు. అనంతరం హద్దు రాళ్ళు ఏర్పాటు చేయించారు. దారి సమస్య పరిష్కారం కావడంతో రైతులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, గ్రామ కాపులు, రంగాయపాలెం సర్పంచి భర్త జి ముసలారెడ్డి ,కొత్తపట్నం కె పల్లిపాలెం సర్పంచి ఆనందరావు, గుండమాల సర్పంచి జయరావు, ఆర్ఐ రామసుబ్బారావు, విఆర్ఒలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

రక్తదానంపై ప్రజల్లో అవగాహన కల్పించండి

ప్రజాశక్తి-బాపట్ల



రక్తదాన శిబిరంలో పాల్గొన్న సొసైటీ పాలకవర్గం

కళాశాల స్థాయిలో విద్యార్థులు రక్తదానం చేయడంతో పాటు ప్రజల్లో రక్తదానం పట్ల అవగాహన కల్పించాలని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు అన్నారు. గురువారం బాపట్ల మహిళ ఇంజనీరింగ్ కళాశాలలో రేపల్లె, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో శ్రీనివాసరావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. రక్తదానం చేయడం ప్రాణదాతలుగా నిలిచి సేవ దృక్పథం కలిగి ఉండాలన్నారు. సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రక్తదానంతో ఒక ప్రాణం నిలబెట్టడానికి దోహదపడుతుందన్నారు. హరి పద్మ ప్రసాద్ శిబిరంలో70 మంది కళాశాల విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో సొసైటీ సంయుక్త కార్యదర్శి హరి పద్మ ప్రసాద్, ఉపాధ్యక్షులు డి రామ్మోహనరావు, జి దిలీప్ కుమార్, కోశాధికారి టి. రామకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి శ్రీనివాసరావు, ఎన్‌సిసి అధికారి కెప్టెన్ శ్రీదేవి, అధ్యాపకులు, ఎన్‌సిసి క్యాడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాపులకు వెన్నుదన్నుగా చంద్రబాబు: టిడిపి

ప్రజాశక్తి-బాపట్ల



మాట్లాడుతున్న బాపట్ల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జిట్టా ప్రమీలారాణి, 'చిత్రంలో) టిడిపి నాయకులు

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో కాపులకు పెద్దపీట వేస్తూ కోటి 50 లక్షల మంది కాపులకు అన్నివిధాలా అండగా నిలిచిన వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని బాపట్ల మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జిట్టా ప్రమీలారాణి అన్నారు. గురువారం బాపట్ల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన టిడిపి కాపు నాయకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బాపట్ల జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొట్టు సత్యనారాయణ కాపుల విషయంలో తెలుగుదేశం పార్టీపై చేసిన విమర్శలను కాపు నాయకులు తీవ్రంగా ఖండించారు. మంత్రి కొట్టు సత్యనారాయణ వాస్తవాలను తెలుసుకోకుండా జగన్ మెప్పు కోసం కాపుల విషయంలో తెలుగుదేశం పార్టీపై, చంద్రబాబుపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కాపు రిజర్వేషన్‌ను వ్యతిరేకిస్తే 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే కాపులకు 5 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిన అంశం కొట్టుకు గుర్తు లేదా అని ప్రశ్నించారు. తుని రైలు దహన ఘటనలో రైలును తగులబెట్టింది వైసీపీ నాయకులు కాదా అని నిలదీశారు. రాజకీయ లబ్ధి కోసం తెలుగుదేశం పార్టీపై నెపం మోపి సంబంధం లేకపోయినా చంద్రబాబును అందులోకి లాగిన వాస్తవం మీకు తెలీదా అన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా తొలిసారిగా కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసి రాష్ట్ర విభజన తరువాత ఆర్థిక లోటు ఉన్నప్పటికీ రూ.3,100 కోట్లు కేటాయించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని అన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు భీమా లీలాకృష్ణ, విన్నుకోట వీరయ్య నాయుడు, మద్దుల వీర కొండలరావు, అనిశెట్టి బసవయ్య, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, దాది పిచ్చయ్య, వళ్ళంసెట్టి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-రేపల్లె: మండలంలోని పోటుమెరక గ్రామంలో కామాక్షి ఐ కేర్ ఆసుపత్రి సౌజన్యం తో ఉచిత కంటి వైద్య శిబిరం సర్పంచ్ కాగితాల హనుమ ప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ ప్రారంభించారు. కామాక్షి ఐ కేర్ హాస్పటల్ డాక్టర్ డి వాసుదేవ రావు సేవలందించారు. గ్రామసర్పంచ్ కాగితాల హనుమ ప్రసాద్ అభ్యర్థన మేరకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరంలో ఆపరేషన్ల కోసం అవసరమైన వారిని గుర్తించి చెరుకుపల్లి కామాక్షి ఐ కేర్ హాస్పటల్‌లో కంటి శస్త్ర చికిత్సలు చేయిస్తున్నట్లు తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో గుర్తించిన రోగులకు ఉచితంగా కంటి అద్దాలు, మందులు పంపిణీ చేశామన్నారు. శిబిరంలో 120 మందికి పరీక్షలు నిర్వహించగా అందులో 50 మందికి ఆపరేషన్లు అవసరం ఉన్నట్లు గుర్తించామన్నారు. సుమారు 120 మందికి వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేసినట్లు డాక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాగితాల హనుమ ప్రసాద్ మాజీ జడ్పిటిసి కాగితాల సుబ్బారావు, డాక్టర్ రాజేష్, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

8 నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి-సంతమాగులూరు

సంతమాగులూరు శాఖ గ్రంథాలయంలో ఈ నెల 8వ తేదీ నుంచి జూన్ నెల 11వ తేదీ వరకు, వేసవి విజ్ఞాన శిబిరం ఏర్పాటు చేసినట్లు గ్రంథ పాలకుడు బాదం విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా, విద్యార్థినీ విద్యార్థులు ఈ వేసవి విరామాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయ శాఖ ఆధీనంలో ఈ వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు,10 సంవత్సరాల నుంచి 15వ సంవత్సరం లోపు వయసు గల విద్యార్థులకు, ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు ఉచితంగా ఈ శిక్షణా శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకుని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

సమావేశం సవ్యంగా సాగేనా?

ప్రజాశక్తి-బల్లికురవ రూరల్

సర్వసభ్య సమావేశం అనగానే గ్రామాలలో సమస్యలను ఆయా సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారుల దృష్టికి తీసుకురావడం, వాటిని పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం సహజంగా జరుగుతుంటుంది. కానీ బల్లికురవ మండలంలో ఎప్పుడు సర్వసభ్య సమావేశం జరిగినా వారి మధ్య సంభాషణలు తప్ప సమస్యలు పరిష్కరించిన దాఖలాలు లేవు. బల్లికురవ మండలంలోని గ్రామాల్లో ప్రధానంగా ఇప్పుడు మంచినీటి సమస్య తలెత్తుతోంది. అధికారులు మాత్రం సమావేశంలో ఇలాంటి సమస్యలు గాలికి వదిలేస్తున్నారు. దీనికి తోడు మండల పరిషత్ అధికారిని ఇప్పుడు బల్లికురవ మండలంతో పాటు సంతమాగులూరు మండలానికి ఇన్‌ఛార్జిగా నియమించారు. కానీ అధికారులు బదిలీలపై తిరగడమే తప్ప సమస్యలపై దృష్టి పెట్టడానికి సమయం లేకుండాపోతోంది. నేడు ఉదయం 11 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా రావాలని పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని ఆయన తెలిపారు.

మోడీ ప్రభుత్వంలో

మహిళలకు రక్షణ కరువు

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి

ప్రజాశక్తి-బాపట్ల

మోడీ ప్రభుత్వంలో మహిళలకు, కష్టజీవులకు రక్షణ లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి విమర్శించారు. గురువారం బాపట్ల పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల కార్యాలయంలో సిపిఎం జిల్లా కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లా కమిటీ సభ్యులు టి.కృష్ణమోహన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రమాదేవి మాట్లాడుతూ నిత్యావసరాల ధరలు పెద్దఎత్తున పెరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ పట్ల వైసీపీ రెండు నాలుకల ధోరణితో వ్యవహరిస్తుండటంతో విశాఖ ఉక్కుకు తీరని నష్టం జరుగుతోందన్నారు. దేశవ్యాప్తంగా మోడీ ప్రభుత్వ విధానాల వల్ల సామాన్య ప్రజలు, రైతులు, కార్మికులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో మహిళా క్రీడాకారులపై బిజెపి ఎంపీ లైంగిక వేధింపులపై ఆందోళన చేస్తుంటే మోడీ స్పందించలేదని, మహిళల రక్షణ గురించి మాట్లాడే నైతిక హక్కు మోడీ కోల్పోయారని విమర్శించారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు తాకట్టు పెడుతున్నారని పేర్కొన్నారు. ఉపాధి హామీ కార్మికులు చేసిన పని మొత్తం నమోదు చేసి.. పూర్తి కూలి ఎటువంటి బకాయి లేకుండా ప్రతివారం చెల్లించాలన్నారు. ఎండవేడికి కూలీలకు ఇబ్బంది లేకుండా రక్షణ కోసం టెంట్లు, మజ్జిగ, మంచినీళ్ల సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య మాట్లాడుతూ వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. జిల్లాలో అధికారులు, ప్రజాప్రతినిధులు వర్షాల వల్ల నష్టపోయిన పంట నష్టంపై స్పందించటం లేదన్నారు. అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు ఎటువంటి కోతలు లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్.మణిలాల్, ఎన్.బాబురావు, సిహెచ్ మజుందార్, ఆర్.వినోద్, ఆంజనేయులు, వసంతరావు, హనుమంతరావు పాల్గొన్నారు.

ఆరోపణలు రుజువు చేస్తే రాజీనామా..

- అసత్య ఆరోపణలు చేస్తే చట్టప్రకారం చర్యలు తప్పవు
- ఒంగోలు డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు వెల్లడి
- తనపై వచ్చిన భూ ఆక్రమణల ఆరోపణలు అవాస్తవమని ప్రకటన



మాట్లాడుతున్న వెలనాటి మాధవరావు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

తనపై కొంతమంది ఉద్దేశపూర్వకంగా తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, పలువురి భూములు ఆక్రమించానని ప్రచారం చేస్తున్నారని ఒంగోలు నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు ఆవేదన వ్యక్తం చేశారు. తనపై చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని ఆయన ఖండించారు. తనపై చేసిన ఆరోపణలు రుజువు చేస్తే తన పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. రాజీవ్‌నగర్‌లోని తన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాధవరావు మాట్లాడారు. తనపై పంచ్ ప్రభాకర్, చెన్నయ్య అనే వ్యక్తులు సోషల్‌మీడియా వేదికగా భూ ఆక్రమణలు చేశానని ఆరోపణలు చేశారని వివరించారు. తాను ఎక్కడా భూ ఆక్రమణలకు పాల్పడలేదని స్పష్టం చేశారు. రెండు, మూడు స్థలాల విషయంలో బాధితులకు అండగా ఉండి వారి భూములు వారికి ఇప్పించానని వివరించారు. బలహీనులకు అండగా నిలబడి కేవలం మాట సాయం మాత్రమే చేశానని చెప్పారు. డాక్యుమెంట్లు అన్నీ సక్రమంగా ఉన్నవారికి అండగా ఉండి వారి భూములు వారికి ఇప్పించినట్లు తెలిపారు. రిజిస్టర్ ఆఫీసులో అవినీతి కారణంగా ఒకటి, రెండు స్థలాల విషయంలో ఫేక్ డాక్యుమెంట్లకు రిజిస్ట్రేషన్లు చేశారని వివరించారు. సమాచార హక్కుచట్టం, ఇతర చట్టాల ప్రకారం ఎవరి భూములు వారికి ఇప్పించినట్లు తెలిపారు. తాను ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అండదండలతో భూ ఆక్రమణలకు పాల్పడుతున్నానని చెప్పడం పూర్తిగా అవాస్తవమన్నారు. తనపై వచ్చిన ఆరోపణపై కలెక్టర్, ఎస్‌పి విచారణ కోరుతున్నానని చెప్పారు. ఆరోపణలు వాస్తవమైతే తన పదవికి రాజీనామా చేస్తానని చెప్పారు. ఆరోపణలు రుజువు చేయని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాను 1995 నుంచి రాజకీయాల్లో ఉన్నానని, ఎంతోమంది పేదలకు సేవచేస్తున్నానని వివరించారు. తన 28 ఏళ్ల రాజకీయ అను భవంలో ఎక్కడా తప్పు చేయలేదని ఉద్ఘాటిం చారు. నిజంగా తాను తప్పుచేసే వ్యక్తినైతే అన్నిసార్లు ప్రజలు రాజకీయాల్లో తనను గెలిపించరు కదా...? అని ప్రశ్నించారు. తనపై సోషల్ మీడియా వేదికగా చేస్తున్న ఆరోపణలు పూర్తిగా తనపై అక్కసుతో, అసూయతో విడుదల చేసినవిగా ఉన్నాయని చెప్పారు. తన రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేక, తనపై బురద చల్లేందుకు పలువురు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. తప్పుడు ఆరో పణలు చేసిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాజకీయాల్లో విలువలతో కూడిన వ్యక్తి బాలినేని శ్రీనివాసరెడ్డి అని చెప్పారు. అలాంటి ఆయన మీద కూడా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనపై చేస్తున్న ఆరోపణలు గురించి బాధితులను కలిసి ఎవరైనా విచారణ చేసుకోవచ్చని చెప్పారు. నిరాధారమైన ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. సమా వేశంలో కార్పొరేటర్లు తాడి కృష్ణలత, ఆదిపూడి గిరిజా శంకర్ శాండిల్య పాల్గొని మాధవరావుకు మద్దతుగా మాట్లాడారు. వెలనాటి మాధవరావు, బాలినేని శ్రీనివాసరెడ్డిపై వచ్చిన ఆరోపణలను వారు ఖండించారు.

వర్షాలకు దెబ్బతిన్న పంటల పరిశీలన



మొక్కజొన్నను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

ప్రజాశక్తి-అమృతలూరు

మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తడిసి దెబ్బతిన్న జొన్న, మొక్కజొన్న పంట పొలాలను బాపట్ల జిల్లా వ్యవసాయ శాస్త్రవేత్తలు గురువారం పరిశీలించారు. మండలంలోని ములుపూరు గ్రామంలో మొక్కజొన్న పొలాలను బాపట్ల జిల్లా వ్యవసాయ అధికారి షేక్ అబ్దుల్ సత్తార్, జిల్లా వనరుల కేంద్రం అధికారి విజయనిర్మల, ఏడిఏ లక్ష్మి, డాట్ సెంటర్ శాస్త్రవేత్తలు డాక్టర్ ఓబయ్య, డాక్టర్ సురేఖ, మండల వ్యవసాయ అధికారి లోకేశ్వరి, ఏఈఓ శ్రీకాంత్ సిబ్బంది సందర్శించారు. మొక్కజొన్న కోత అనంతరం పొలంలో గుట్టలుగా పోసి వర్షానికి తడవకుండా పట్టలను కప్పిన పొలాలను అధికారులు పరిశీలించారు. ధాన్యం రంగు మారడాన్ని గమనించారు. మొలక రాకుండా ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని కండెలపై చిలకరించాలన్నారు. మొక్కజొన్న కోత తరువాత కల్లంపైన ఆరబెట్టిన కండెలు వీలైనంతవరకు నీటితో తడవకుండా జాగ్రత్త తీసుకోవాలని చెప్పారు. తడి కండెలను కుప్పగా పోయరాదని, గాలి బాగా తగిలేటట్లు ఇంట్లో గానీ, బయట గానీ ఆరబెట్టుకోవాలని తెలిపారు. తడి కండెలపైన తార్పాలిన్ పట్టాలు కప్పకూడదన్నారు. మండలంలో దెబ్బతిన్న మొక్కజొన్నను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి అబ్దుల్ సత్తార్ అన్నారు.

యువతను మోసగించిన జగన్ ప్రభుత్వం

- నాలుగేళ్లుగా జాబ్ కేలండర్ ఇవ్వని ప్రభుత్వం
- టిడిపి జిల్లా అధ్యక్షులు నూకసాని బాలాజీ విమర్శ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

అధికారంలోకి రాగానే 2.30 లక్షల ఉద్యోగాల భర్తీ, ప్రతి ఏటా జనవరి ఒకటిన జాబ్ క్యాలెండర్ అంటూ ప్రగల్భాలు పలికిన జగన్ రెడ్డి నిరుద్యోగుల్ని నిలువునా మోసం చేశారని తెలుగుదేశం పార్టీ ప్రకాశం జిల్లా అధ్యక్షులు, మాజీ జడ్పీ ఛైర్మన్ డాక్టర్ నూక సాని బాలాజీ తెలిపారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు లేక, రాష్ట్రానికి కొత్తగా పరిశ్రమలు రాక, స్వయం ఉపాధికి ప్రభుత్వం నుంచి సహకారం లేక యువత భవిత ప్రశ్నార్థకంగా మారిం దన్నారు. సిఎంఐఇ నివేదిక ప్రకారం రాష్ట్రంలో 2019 ఏప్రిల్ నాటికి 4.0 శాతం ఉన్న నిరుద్యోగిత శాతం డిసెంబర్ 2022 నాటికి 7.7 శాతానికి పెరిగిందన్నారు. టిడిపి ఐదేళ్ల పాలనలో పరిశ్రమల ద్వారా 5.13 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించారని నాటి మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డే అసెంబ్లీలో చెప్పారని నూకసాని తెలిపారు. నాలుగేళ్ల వైసిపి పాలన లో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కమీషన్ల కక్కుర్తితో మూడున్నరేళ్లలో రూ.17 లక్షల కోట్ల పెట్టుబడులు పొరుగు రాష్ట్రాలకు తరిమేసి 34 లక్షల మంది యువత ఉపాధికి గండి కొట్టారని విమర్శించారు. అమరావతి



మాట్లాడుతున్న నూకసాని బాలాజీ

నిర్మాణంతో 15 లక్షల ఉద్యోగాల కల్పనకు శ్రీకారం చుడితే జగన్ అమరావతిని నిర్వీర్యం చేశారని నూకసాని ఆవేదన వ్యక్తంచేశారు. టీడీపీ హయాంలో రెండు సార్లు డీఎస్సీ నిర్వ హించి 18 వేల ఉద్యోగాలిచ్చినట్లు తెలిపారు. కానీ ప్రతి ఏటా మెగా డీఎస్సీ అన్న జగన్ రెడ్డి ఒక్క టీచర్ ఉద్యోగం భర్తీ చేయలేదని విమర్శించారు. నిరుద్యోగ యువతకు ప్రభుత్వ పనుల్లో కాంట్రాక్టులు ఇస్తానన్న జగన్ రెడ్డి ఎన్ని కాంట్రాక్టులిచ్చారు, ఎంతమందిని కాంట్రాక్టర్లుగా తయారు చేశారని ప్రశ్నించారు. చంద్రబాబునాయుడు ప్రతి నెలా 6 లక్షల మంది నిరుద్యోగ యువతకు రూ.2 వేలు నిరుద్యోగ భృతి ఇస్తే జగన్ దీనిని రద్దు చేశారన్నారు. ఎస్సి, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు కార్పొరేషన్ల యువతకు సబ్సిడీ బ్యాంకు రుణాలతో స్వయం ఉపాధి కల్పిస్తే జగన్ రద్దు చేసి నిరుద్యోగుల పొట్ట కొట్టారని విమర్శించారు. 25 మంది ఎంపీలతో కేంద్రం మెడలు వంచి సాధిస్తానన్న ప్రత్యేక హోదా ఏమైందని ప్రశ్నించారు. ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు లేక రాష్ట్రంలో యువత గంజాయి, డ్రగ్స్ మద్యం వంటి వ్యసనాలకు బానిసలుగా మారి జీవితాలను పాడు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2021లో గంజాయి, మత్తు పదార్థాలకు బానిసలై ఏపీలో 571 మంది యువత ఆత్మహత్యకు పాల్పడ్డట్లు ఎన్‌సిఆర్‌బి (నేషనల్ క్రైంబ్యూరో) నివేదిక చెబుతోందని, వీటన్నింటికి కారణం జగన్ ప్రభుత్వ అసమర్థ, చేతకాని పాలనే అని విమర్శించారు. సిఎం జగన్ ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నీ భర్తీ చేయాలని కోరారు.

డీఎస్పీగా అశోక్‌వర్ధన్ బాధ్యతల స్వీకరణ



డీఎస్పీ అశోక్‌వర్ధన్

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

ఒంగోలు డీఎస్పీగా అశోక్‌వర్ధన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. విజిలెన్స్ డీఎస్పీగా ఉన్న ఈయన ఒంగోలు డీఎస్పీగా బదిలీపై వచ్చారు. ఇక్కడ డీఎస్పీగా పనిచేస్తున్న నాగరాజు హెడ్ ఆఫీస్‌లో రిపోర్టు చేయనున్నారు.

తల్లిని కొడుతున్నాడని తండ్రిపై ఫిర్యాదు

పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన బాలుడు

ప్రజాశక్తి-కర్లపాలెం



ఎస్ఐతో మాట్లాడుతున్న బాలుడు

తన తండ్రి రోజూ తాగొచ్చి.. తన తల్లిని కొడుతున్నాడని కర్లపాలెం ఎస్సై శివయ్యకు తొమ్మిదేళ్ల బాలుడు గురువారం ఫిర్యాదు చేశాడు. కర్లపాలెం గ్రామంలోని పాత ఇస్లాంపేటకు చెందిన బాలుడు గురువారం పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. తన తండ్రి రోజూ మద్యం సేవించి తన తల్లిని కొడుతున్నాడని ఎస్ఐకి ఫిర్యాదు చేశాడు. స్పందించిన ఎస్ఐ శివయ్య బాలుడి తల్లిదండ్రులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. బాలుడి తండ్రికి కౌన్సిలింగ్ ఇచ్చి.. పంపించారు.



ఇందిరా కాలనీ పక్కనే పొంగిన వాగు

పొంగిన వాగులు

ప్రజాశక్తి-వెలిగండ్ల

మండలంలో కురిసిన భారీవర్షం కారణంగా వాగులు, వంకలు పొంగిపొర్లాయి. బుధవారం రాత్రి 79.2 ఎంఎం వర్షపాతం నమోదైంది. వెలిగండ్లలోని ఇందిరా కాలనీలోనికి వర్షపు నీరు వచ్చి చేరింది. కాలనీ పక్కనే ఉన్న వాగు పొంగిపొర్లింది. బిసి కాలనీ నుండి ఎస్సీ కాలనీ వరకు ఉన్న వాగు ఉధృతంగా ప్రవహించింది. ఎక్కడా పంట నష్టం వాటిల్లలేదు.